

యథావిధిగా 'జగనన్నకు చెబుదాం' : కలెక్టర్

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రాయచోటి జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తామని కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

రజకుల బతుకులు

'తెల్ల'బడేదెన్నడో?

- పేరుకే రజక కార్పొరేషన్
- ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లేదు
- చెడిపోయిన బోర్లు
- నిరుపయోగంగా దోబీఘాట్లు
- ఇబ్బందుల్లో రజకులు-పట్టని ప్రభుత్వాలు



కంపచెట్ల మధ్య నిరుపయోగంగా ఉన్న దోబీఘాట్లు

ప్రజాశక్తి - రాయచోటి

పలువురు ధరించే వస్త్రాలను తెల్లగా ఉతికి, ఇస్త్రీ చేసి వారిని పది మందిలో హుందాగా కన్పించేలా చేసేవారు రజకులు. కానీ ఏళ్ళ గడుస్తున్నా అందరి మురికి బట్టలను తెల్లబడేలా శుభ్రం చేస్తున్నా వారి జీవితాలు మాత్రం నేటికీ నేటికీ తెలబడడం లేదు. అన్నమయ్య జిల్లావ్యాప్తంగా దాదాపు 30 వేల మంది రజకులున్నారు. వీరిలో దాదాపు 12,000 మంది రజక వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఏటిలో, చెరువులో నీళ్ల లేకపోవడంతో బట్టలు ఉతకడానికి రజకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో రజకులకు దోబీ ఘాటు ఏర్పాటు చేసి వారికి ఆదరణ పథకం కింద ఇస్త్రీ పెట్టెలు, ఇనుప అండాలు, తోపుడు బండ్లు ఇచ్చేది. దోబీఘాట్ల వద్ద బోరు మోటారు ఏర్పాటు చేసి మంచి నీటిలోని బట్టలు ఉతుకొని అక్కడే ఆరబెట్టుకునేందుకు స్థలం కూడా కేటాయించారు. ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో బోర్లు ఎండిపోయి. ఉన్న మోటర్లు చెడిపోవడం వల్ల నీరు లేక దోబీ ఘాట్లన్నీ ముళ్ళపదలతో నిండికున్నాయి. చెడిపోయిన మోటార్లు తయారు చేసేందుకు పంచాయతీ వారి వద్ద నిధులు లేకపోవడంతో తాము ఏమీ చేయలేమంటూ చేతులెత్తేశారు. దీంతో దోబీఘాట్లు నేడు నిరుపయోగంగా మారిపోయాయి. చెడిపోయిన బోర్లు మోటార్లను తయారు చేయించాలంటూ సర్పంచ్లను కోరగా వారు ప్రభుత్వమే పంచాయతీలో ఉన్న డబ్బులు అన్ని లాక్కున్నారని తమ వద్ద ఎలాంటి నిధులు లేవని తెలిపారు. కనీసం వీధిలైట్లు పోయిన పారిశుధ్య పనులు చేపట్టాలన్న నిధులు లేవని సర్పంచ్లు చెబుతున్నట్లు రజకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో దోబిఘాట్లు ఆక్రమానికి గురవుతున్నాయని వాపోయారు. ఎన్నికల సమయంలో నాయకులు తమ వద్దకు వచ్చి తమ పార్టీకి ఓట్లు వేసి గెలిపిస్తే మీకు ఇల్లు, ఇళ్ల స్థలాలు దోబీ ఘాట్లు ఇస్తామంటూ చెప్పి ఎన్నికల తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బట్టలు ఉతకడానికి నీటి సదుపాయం లేకపోవడంతో 2,3 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. అక్కడికి వెళ్లేందుకు గతంలో అయితే గాడిదలు ఉండేవని, వాటిపై మూటలు వేసుకొని వెళ్లి ఉతికి ఆరబెట్టుకుని తిరిగి రైతులకు ఇచ్చేవాళ్ళమన్నారు. ప్రస్తుతం గాడిదలు లేవు తాము మోయలేక అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కొన్ని చోట్ల నీళ్ల ఉన్నప్పటికీ ఆ నీటిలో గంటల తరబడి నుంచి బట్టలు ఉతకడం వల్ల కాళ్ళు పేలిపోవడం చేతులు తెల్లబడిపోయి వంకరలు కావడం కీళ్ల జబ్బులు వస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో అనారోగ్యం గురైతే ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేసేవారని , ఇప్పుడు కార్పొరేట్ ఆసుపత్రిలో తెల్ల కార్డు చూపితే ఉచిత వైద్య సేవలు కూడా అందడం లేదన్నా తెలిపారు. చాలామంది కాళ్ల వంకర్లు పోవడం, చేతులు పేలిపోవడం, నడుములు, భుజాల నొప్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతునందని చెప్పారు. ఇస్త్రీ చేయాలన్న బొగ్గులు దొరకడం లేదని పేర్కొన్నారు. బొగ్గులు మూటలు కొని వాటి చేత ఇస్త్రీ చేయాలంటే ఆర్థిక భారం అధికమైందని తెలిపారు. ఓ ప్యాంటు, చొక్కా ఇస్త్రీ చేస్తే కేవలం రూ.10 మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ా తమ జీవితాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన వాపోతున్నారు. .రాష్ట్ర ప్రభుత్వం రజకుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదని వాపోయారు. బ్యాంకుల ద్వారా రజకులకు రుణాలు మంజూరు చేసి ఇస్త్రీ పెట్టెలు, తోపుడు పండ్లు, గంగాళాలు వంటి వాటిని సబ్సిడీతో అందించాలని, రజకులకు రాజకీయ, సామాజిక అన్ని రంగాలలో ప్రాధాన్యత కల్పించి, కార్డులు ఇతర పరికరాలు చేయాలని పలువురు రజకలు కోరుతున్నారు .

సౌకర్యాలు కల్పించాలి



దోబి ఘాటు వద్ద విద్యుత్ సౌకర్యం, షెడ్లు, తాగునీరు వంటి సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలి. బట్టలు ఉతికి , ఇస్త్రీ చేయడం వల్ల నడుములు, కీళ్లు, ఇతర అనారోగ్య సమస్యలొస్తున్నాయి. పని చేస్తేనే పూట గడుస్తుంది. గతంలో మాదిరిగా బట్టలు కూడా ఎక్కువగా రావడం లేదు. రజక వృత్తి చేసే వారికి ప్రభుత్వం పెన్షన్, ఇన్సూరెన్స్ కార్డులు పంపిణీ చేయాలి.

-శ్రీనివాసులు, రజకుడు, రాయచోటి.

ప్రభుత్వం ఆదుకోవాలి



జిల్లా వ్యాప్తంగా రజక వృత్తి చేసే వారందరికీ వాషింగ్ మిషన్, విద్యుత్ ఇస్త్రీ పెట్టెలు, తోపుడు బండ్లు, ఉచిత విద్యుత్ సదుపాయాలను వంటి సదుపాయాలను ఇవ్వాలి. ప్రభుత్వ ఆసుపత్రి, ఆలయ లలో బట్టలు ఉతికే పనిని రజకులకు అప్పజెప్పాలి. రజక వృత్తి చేసే చేసే ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్ కార్డులు,పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలి.

- టి . రమేష్ బాబు, రజక సంఘం జిల్లా అధ్యక్షులు, రాయచోటి. అన్నమయ్య జిల్లా.

ప్రాజెక్టుల పనులను పరుగులు తీయిస్తాం

- రూ.454 కోట్లతో పరిహారం చెల్లింపులకు కసరత్తు
- రూ.12.10 కోట్లతో లీకేజీ పనులకు ప్రతిపాదనలు
- జిఎన్ఎస్ఎస్ పరిధిలోని ప్రాజెక్టుల్లో 38 టిఎంసిల నీటి నిల్వ
- జిఎన్ఎస్ఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.మల్లికార్జునరెడ్డి



ముఖా ముఖి..

ప్రజాశక్తి -కడపప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పనుల్ని వేగవంతం చేస్తున్నాం. ఇందుకుగానూ సుమారు రూ.400 కోట్లతో 3.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించే పనులపై దృష్టి సారించాం. చిన్న, మధ్యతరహా, భారీ సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో తక్కువ వ్యయంతో కూడిన డిస్ట్రి బ్యూటరీ పనులు చేపడుతున్నాం. ఉమ్మడి రాష్ట్రంలోనే పెద్దదైన మొగమేరు అక్విడక్ట్ను పూర్తి చేయడంపై దృష్టి సారించామని గాలేరు-నగరి సుజల స్రవంతి పథకం సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎం.మల్లికార్జునరెడ్డిని ప్రజా శక్తి కలిసిన సందర్భంగా ముఖాముఖి..

జిఎన్ఎస్ఎస్ పరిధిలోని ప్రాజెక్టుల గురించి తెలపండి?

జిఎన్ఎస్ఎస్ పరిధిలో 11 ప్రాజెక్టులున్నాయి. గండికోట, గండికోట మెయిన్ కెనాల్, అలవలపాడు లిఫ్ట్, జిఎన్ఎస్ఎస్ హెచ్ఎన్ ఎస్ఎస్ లిఫ్ట్, సిబిఆర్- ఎర్రబల్లి లిఫ్ట్, గండికోట-సిబిఆర్- పైడిపాలెం అప్గ్రేడేషన్, మైక్రోఇరిగేషన్-సిబిఆర్, జికెఎల్ఐ, పిబిసి కెనాల్స్, సిబిఆర్, వామికొండ, సర్వరాయసాగర్, మైలవరం ప్రాజెక్టులున్నాయి.

సాగునీటి ప్రాజెక్టుల నీటి నిల్వల సామర్థ్యం ఎంత?

జిఎన్ఎస్ఎస్ సాగునీటి ప్రాజెక్టులు 52 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలోని జిఎన్ఎస్ఎస్ పరిధిలోని పలు రిజర్వాయర్లలో 38 టిఎం సిలు నిల్వ ఉన్నాయి.

డిస్ట్రిబ్యూటరీ పనుల వివరాలు తెలపండి?

జిఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ కింద 92 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం 45 వేల ఎకరాలకు డిస్ట్రిబ్యూటరీ సదుపాయాల కల్పనకు కృషి జరుగుతోంది. సర్వరాయసాగర్ కింద 25 వేలు, వామికొండ కింద 10 వేల ఎకరాలు, జిఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ 0 నుంచి 66 కిలో మీటర్ వరకు 10 వేల ఎకరాలు ఉంది. డిసెంబర్ నాటికి 35 వేల ఎక రాలకు నీటిసదుపాయం కల్పించడం జరుగుతోంది. ఇందుకు గానూ 60 కోట్లతో కూడిన పనులు చేపట్టడమైంది.

గండికోట పరిహారం చెల్లింపుల గురించి తెలపండి?

గండికోట నిర్వాసిత గ్రామాలైన ఫేజ్-1లో 14 గ్రామాలు, ఫేజ్-2లో నాలుగు గ్రామాలు, ఫేజ్-3లో మూడు గ్రామాలు వెరసి 21 గ్రామాల పరిధిలో 17,809 పిడిఎఫ్లు ఉన్నాయి. ఇప్పటివరకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించడమైంది. ఇందులో తాళ్లప్రొద్దుటూరు, చామలూరు, ఎర్రగుడి, పి.అనంతపురం, ఏటూరు, రేగడపల్లి, కె.సుగమంచిపల్లి గ్రామాల పరిధిలో 999 పిడిఎఫ్లకు సంబంధించి ఓటిఎస్ కింద రూ.10 లక్షలు, ఆర్అండ్ఆర్ కేటగిరీ కింద రూ.6.75 లక్షలు చెల్లించడమైంది. కొత్త రేటు ప్రకారం రూ.ఏడు లక్షలు నగదు, ఐదు సెంట్లు స్థలం కేటా యించడం జరుగుతోంది.

గండికోట పరిహారం విలువ ఎంత?

రూ.999 పిడిఎఫ్లకు సంబంధించి రూ.454 కోట్లు కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉంది.గతంలో సిఎం ఇచ్చిన హామీ అమలులో భాగంగా రూ.454 కోట్లు తాజాగా విడుదల చేయడమైంది. త్వరలో పంపిణీ చేయడానికి సంబంధించిన కసరత్తు ఊపందుకుంది.

అదనపు ఆయకట్టు గురించి చెప్పండి?

జిఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ నిర్మాణాలకు రూ.400 కోట్లు విడుదల చేస్తే జిల్లాలోని ఆరు లక్షల ఎకరాల్లో మూడు లక్షల ఎకరాలకు డిస్ట్రిబ్యూటరీల ద్వారా నీటిని అందిస్తాం. ఇందులో పులివెందుల నియోజకవర్గ పరిధిలోనే 1.66 లక్షల ఎకరాలకు డిస్ట్రిబ్యూటరీల ద్వారా సాగునీరు అందించే అవకాశం ఉంది. పులివెందుల పరిధిలోని 1.65 లక్షల ఎకరాల్లో 1.22 లక్షల ఎకరాలు మైక్రో ఇరిగేషన్ కింద అందుబాటులోకి వస్తుంది. ఈమేరకు ప్రాజెక్టుల వారీగా డిస్ట్రిబ్యూటరీ నిర్మాణ పనులపై సర్వే చేపట్టాల్సి ఉంది.

సర్వరాయసాగర్ లీకేజీ పనుల సంగతేమిటి?

రూ.212 కోట్లతో సర్వరాయసాగర్ ప్రాజెక్టు పనులకు టెండర్లు పిలిచాం. ఇందులో లీకేజీ పనులకు సంబంధించి రూ.5.50 కోట్లు, వామి కొండ కింద రూ.6.6 కోట్ల వ్యయంతో కూడిన ప్రతిపాదనలు పంపిం చడమైంది. పాలనామోదం లభించింది. ఇందుకూరు గ్రామంలో భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లింపులు ప్రయత్నం చేస్తున్నాం. టెండర్ దశను అధిగమించాం. వారం రోజుల వ్యవధిలో గ్రౌటింగ్ పనులు చేపడతాం.

మైక్రో ఇరిగేషన్ పనుల తీరుతెన్నుల గురించి వివరించండి?

రూ.1260 కోట్లతో డ్రిప్ ఇరిగేషన్ చేపట్టడమైంది. జికె ఎల్ఐ పరిధిలోని 800 సంపుల్లో ఇప్పటికి 120 సంపులు పూర్తి చేయడమైంది. మిగిలిన నిర్మాణాలను పూర్తి చేయడంపై దృష్టి సారించాం. ఎల్ఎ సం బంధించిన సమస్య కొనసాగుతున్నందున ఆలస్యంగా సాగుతోంది. ఏదే మైనప్పటికీ సాధ్యమైన మేరకు త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రాధాన్యత ఇచ్చాం.

మైలవరం రిజర్వాయర్ల కట్టల పునరుద్ధరణ ఎప్పుడో?

రూ.88 కోట్లతో ప్రతిపాదనలు పంపించడమైంది. రాష్ట్రప్రభుత్వ ఆమోదం లభించాల్సి ఉంది. మైలవరం రిజర్వాయర్ పరిధిలోని 75 వేల ఎకరాలకు ఆయకట్టు నీరందిస్తాం. ఇందులో 55 వేల ఎకరాలకు సాగు నీటిని అందించడమైంది. చిత్రావతి రిజర్వాయర్ల కట్టలు కుంగిన మాట వాస్తవమే. ఎడమ వైపు ప్రొటెక్షన్ గైడ్వాల్ టెండర్ పిలిచే పనుల్లో నిగమ్న మయ్యాం. రివిట్మెంట్ ముందుభాగంలో 15 మీటర్ల ఎత్తు 300 మీటర్ల పొడవునా 10 లొకేషన్లలో రివిట్మెంట్ కుంగిన మాట వాస్తవమే. రీప్లేస్ చేయడానికి రూ.14 కోట్ల టెండర్లు పిలిచే పనుల్లో ఉన్నాం.

కాలేటివాగు ప్రాజెక్టు పురోగతిని వివరించండి?

: పిఎల్ఆర్ కాంట్రాక్టు సంస్థ రూ.5,0030 కోట్లతో టెండరును దక్కిం చుకుంది. రూ.4,300 కోట్ల పనుల్లో ఇప్పటి వరకు 20 శాతం పను లు చేపట్టింది. 2023 డిసెంబర్ నాటికి కాలేటివాగు పనుల్ని పూర్తి చేస్తాం. జిఎన్ఎస్ఎస్ నంచి హెచ్ఎన్ఎస్ఎస్ ఎత్తిపోతల పథకం పనులి వి. కడప జిల్లాలోని మొదటి భాగంలో భాగమైన కాలేటివాగు. కడప జిల్లాలో 40 వేలు, అన్నమయ్య జిల్లాలో లక్ష ఎకరాలు, చిత్తూరు జిల్లాల్లో 1.50 లక్షల ఎకరాలు వెరసి 2.90 లక్షల ఎకరాల ఆయకట్టు అందుబా టులోకి రానుంది.

చిత్రావతి-ఎర్రబల్లి ఎత్తిపోతల పనుల పురోగతి తెలపండి?

రూ.850 కోట్లతో చిత్రావతి-ఎర్రబలి ఎత్తిపోతల పనులు చేపట్టాం. వేముల మండలంలోని గిడ్డంగివారిపల్లి దగ్గర పనులు జరుగుతున్నాయి. చిత్రావతి రిజర్వాయర్ నుంచి గిడ్డంగివారిపల్లి వరకు 48 కి.మీటర్ల పైప్లైన్ పనుల్లో నాలుగు కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేశాం. రెండు టిఎంసిల నీటిని ఎత్తిపోతల ద్వారా పంపింగ్ చేయాల్సి ఉంది. ఇందులో వేముల, వేంపల్లి ప్రాంతాల్లోని ఆరు చెరువులను నిం పా ల్సి ఉంది. అనంతరం వేంపల్లిలోని గిడ్డంగివారి పల్లి చెరువును నీటిని సర ఫరా చేయడం ద్వారా 10 వేల ఎకరాల అదనపు ఆయకట్టు లభించే అవ కాశం ఉంది. ఎర్రబల్లి ఎత్తిపోతల పనుల వల్ల యుసిఐఎల్ పరిధిలోని ఆరు నిర్వాసిత గ్రామాలకు శుద్ధ జలాన్ని అందిస్తాం.

రాయలసీమ డ్రౌట్ మిటిగేషన్ ప్రాజెక్టు పురోగతి ఎలా ఉంది?

కడప జిల్లాలో రూ.11 వేల కోట్లతో రాయలసీమ డ్రౌట్ మిటిగే షన్ ప్రాజెక్టు పనుల్ని వేగవంతం చేశాం. సుమారు రూ.7,500 వేల కోట్లతో పనుల్ని చేపట్టడమైంది. దీంతో సుమారు 3.50 లక్షల ఎకరాల స్థిరీకరణకు అవకాశం ఉంది. ఐదు లక్షల మందికి తాగునీటిని అందించే అవకాశం ఉంది. ఉమ్మడి కడప జిల్లాలో రూ.500 కోట్లతో జిఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ విస్తరణ, రూ.650 కోట్లతో గండికోట లిఫ్టు స్కీమ్ పనుల తోపాటు మరో రూ.350 కోట్లతో ఇతర పనుల్ని చేపట్టడం జరిగింది.

రైతును వ్యాపారస్తుడిని చేయడమే

ఆర్ఎం కిసాన్ ధ్యేయం

- అధునాతన పరికరాలతో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు
- ఆర్ఎం కిసాన్ సెంటర్ వ్యవస్థాపకులు రాజశేఖర్రెడ్డి



కిసాన్ సెంటర్ ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులతో రాజశేఖర్రెడ్డి

ప్రజాశక్తి - కమలాపురం

ప్రతి రైతునూ వ్యాపారస్తుడిని చేయడమే ఆర్ఎం కిసాన్ ధ్యేయమని ఆర్ఎం కిసాన్ సెంటర్ వ్యవస్థాపకులు రాజశేఖర్రెడ్డి పేర్కొన్నారు. నియోజ కవర్గంలోని వీరపునాయునిపల్లె మండలం ఎన్.పాలగిరి గ్రామంలో ఆదివారం ఆర్ఎం కిసాన్ సెంటర్ను కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్సీసీ ఛైర్మన్ మల్లిఖార్జునరెడ్డి, రాష్ట్ర అగ్రికల్చర్ సలహాదారుడు తిరుపాల్ రెడ్డి, ఆర్టికల్చర్ సలహాదారుడు ప్రసాద్రెడ్డి, వ్యవసాయ అధికారులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ కొన్నేళ్ల కిందట ప్రతిభ బయోటెక్ సంస్థను స్థాపించి 60 మంది ఉద్యోగులతో వ్యవసాయాధారిత ఉత్పత్తులను రైతులకు అందిస్తూ నేడు ఈ స్థాయికి చేరామని చెప్పారు. ప్రస్తుతం సంస్థలో సుమారు 700 మంది ఉద్యోగులు ఉన్నారన్నారు. అధునాతన పరికరాలతో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఇక్కడ అందుబాటులో ఉందని చెప్పారు. రైతులు తమ వ్యవసాయ పొలాలకు సంబందించిన మట్టి, నీరు, ఎరువులు ఆయా భూములకు సరిపడే విధంగా పరీక్షలు చేసి సలహాలు ఇస్తారని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు ఇందులో భాగంగా ప్రతి శనివారమూ వంద మంది రైతులకు అన్ని వసతులు కల్పిస్తూ భోజన వసతి కూడా ఏర్పాటు చేసి వ్యవసాయంపై అధునాతన విధానాలు, ఏయే పంటలకు ఏవేవి అవసరం ఏవిధంగా అత్యధిక లాభాలు పొందవచ్చో అనే అంశాలపై తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సంస్థకు అడిగిన వెంటనే సర్వరాయ సాగర్ నుంచి నీటిని అందించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో భారత్ బయోటెక్ పరిశ్రమ ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. కరువు ప్రాంతమైన ఇక్కడ ఈ పరిశ్రమ రావడంతో రైతులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. రైతుల కోసం ఏర్పాటుచేసిన సంస్థను ఉపయోగించుకుని మంచి ఫలితాలు పొందాలని తెలియజేశారు.

కరాటేలో విద్యార్థులకు 52 పతకాలు



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

పీలేరు : 2023 ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో పీలేరు విద్యార్థులు 52 పతకాలను సాధించారని కుంగ్ ఫూ మాస్టర్ దాము తెలిపారు. ఏపి ఇన్విటేషనల్ వకినవా గోజు - ఆర్వైయు ఆదివారం మదనపల్లి టిటిడి కల్యాణ మండపంలో 2023 ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ నిర్వహించారు. పీలేరులోని శ్రీ భువన విద్యాలయం, వివిఎన్ విద్యాసంస్థలతో పాటు పలు ఇతర పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఈ పోటీల్లో 20 బంగారు పతకాలు, 21 వెండి పతకాలు, 11 కాంస్య పతకాలను గెలుచుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా సురేష్ మాస్టర్ పీలేరు కు చెందిన దాము మాస్టర్ ను జ్ఞాపికతో పాటు సన్మానించి సత్కరించారు.

23న జిల్లాస్థాయి హిందీ వ్యాసరచన పోటీలు

రాజంపేట అర్బన్ : ప్రేమ్ చంద్ హిందీ భవన్ సొసైటీ రాజంపేట ఆధ్వర్యంలో ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో 9, 10వ తరగతి విద్యార్థులకు 'దేశ్ కీ సేవ మే ప్రేమ్ చంద్ కా యోగ్దాన్"అనే అంశంపై కడప ఉమ్మడి జిల్లా స్థాయిలో హిందీ వ్యాసరచన పోటీలు ఈ నెల 23న స్థానిక బివిఎన్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 31న ప్రముఖ హిందీ నవలాకారుడు మున్షి ప్రేమ్ చంద్ జయంతి సందర్భంగా ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. వ్యాసరచనలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు ప్రేమ్ చంద్ జయంతి రోజున బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 6303701314లో సంప్రదించాలన్నారు.

ఉత్తమ విలువలతో కూడిన విద్య అవసరం

రాయచోటి : ఉత్తమ విలువతో కూడిన ఉద్యమం అందించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాసాపేటలో జిల్లా అధ్యక్షులు కె. రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం సమాజంలో ఉత్తమ విలువలతో కూడిన విద్యను అందించేందుకు దోహదపడే ఉపాధ్యాయులను దేశభక్తి పరులుగా తీర్చి దిద్దేందుకు పని చేస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అఖిల భారత స్థాయిలో ఎబిఆర్ఎస్ఎంకు అనుబంధంగా జాతీయస్థాయిలో పనిచేస్తూ ఉన్న ఏకైక అతిపెద్ద సంఘంగా ఉంది అని తెలిపారు .జిల్లా ప్రధాన కార్యదర్శి మంద నరసింహులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యోన్నతులు బదిలీల ద్వారా వచ్చిన ఉపాధ్యాయులకు క్యాడర్ స్ట్రెంత్ అప్డేట్ చేసి త్వరగా జీతాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధుమతి మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర అమోఘమైందని సమాజ అభ్యున్నత కోసం పాటుపడే వారిలో మహిళల పాత్ర పెరగాలని కోరారు. అనంతరం ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను స న్మానించారు.కార్యక్రమంలో తిరుపతి విభాగ ప్రముఖ రెడ్డప్ప, జిల్లా కోశాధికారి డి రామేశ్వర్, జిల్లా సహాయ అధ్యక్షులు రామాంజనేయరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీజీ సెట్లో జ్ఞానాంబిక విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ జూన్ నెలలో నిర్వహించిన ఏపీ పీజీ సెట్ పరీక్షల్లో మదనపల్లి శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫైనల్ ఇయర్ బిజెడ్సి చదువుతున్న ఎ. బిందు పిజి సెట్ జువాలజీలో రాష్ట్రస్థాయిలో 23వ ర్యాంకు సాధించిందని, జకియా తస్వీర్ జెడ్ సిలో జువాలజీ సబ్జెక్టులో 39వ ర్యాంకు సాధించిందని, జి.హెప్సిబా ఇంగ్లీష్ సబ్జెక్టులో రాష్ట్రస్థాయి 28వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ , అధ్యాపకులు రాఘవేంద్ర, మాధవి, రమ్య అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పి కె. కేశప్ప

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి : డిఎస్పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి, పాత నేరస్తులపై నిఘా ఉంచి, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి డిఎస్పి కె. కేశప్ప తెలిపారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు ఆదేశాల ఆదివారం డిఎస్పి కార్యాలయంలో సబ్ డివిజన్ స్థాయిలోని అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన పలు సూచనలు తెలియజేశారు. 2019 సంవత్సరం నుంచి 13 ఎన్డిపిఎస్ కేసులలో 44 మంది ముద్దాయిలను గుర్తించి అరెస్టు చేశామని చెప్పారు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచి షీట్స్ ఓపెన్ చేశామని తెలియజేశారు. పట్టణంలోని వన్ టౌన్, టూ టౌన్, తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి ప్రాంతాలలో గంజాయి విక్రయం దారుల గురించి ప్రత్యేక నిఘా ఉంచామని వారిపై ఇప్పటివరకు కేసులు నమోదు చేసి రౌడీషీట్స్ ఓపెన్ చేశామని చెప్పారు. ఫోక్సో కేసులకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు సాంకేతికపరమైనటు వంటి ఆధారాలు కూడా సేకరించి నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చేస్తున్నామని పేర్కొన్నారు. హత్య కేసులకు సంబంధించి కూడా నేరస్తులను వెంటనే గుర్తించి అరెస్టు చేస్తున్నామని అక్రమ నాటుసారా, కర్ణాటక అక్రమ మద్యం విక్రయదారులను గుర్తించి వారిని అరెస్టు చేశామని చెప్పారు. చట్టాన్ని అతిక్రమించి అక్రమ మద్యం వినియోగదారులపై షీట్స్ కూడా ఓపెన్ చేస్తామని తెలిపారు. సమావేశంలో మదనపల్లి టూ టౌన్ సిఐ ఎస్ .మురళీకృష్ణ, వన్ టౌన్ సిఐ .మహబూబ్ బాషా, రూరల్ సర్కిల్ సిఐ శివాంజనేయులు , సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, ఎఎస్ఐలు, కోర్టు సిబ్బంది, రైటర్లు పాల్గొన్నారు.

రేషన్... పరేషాన్!

చివరి రోజు లబ్ధిదారులకు తప్పని తిప్పలు

మొరాయిస్తున్న బయోమెట్రిక్ మిషన్లు

ప్రజాశక్తి-పీలేరు

రేషన్ బియ్యం కోసం వినియోగదారులకు పరేషాన్ తప్పడం లేదు. చౌక దుకాణాల ముందు బియ్యం కోసం ప్రజలు పనులు మానుకుని, గంటల తరబడి నిరీక్షించే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇంటింటికి చౌక బియ్యం పంపిణీ చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రేషన్ బియ్యం సరఫరా కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రత్యేక వాహనాలను కొనుగోలు చేసి వాటిని మండలాలకు పంపింది. వాటి నిర్వహణ కష్టంగా మారడంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోతున్నాయి. దీంతో ప్రభుత్వం చెప్పేదొకటి క్షేత్రస్థాయిలో జరుగుతోంది మరొకటని, ప్రతిపక్షాలు చేస్తూన్న ఆరోపణలను రేషన్ దుకాణాల ముందు బారులు తీరుతున్న జనం దృశ్యాలు బలాన్ని చేకూరుస్తున్నాయి. చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకులు తీసుకునే లబ్ధిదారులు ఈ నెల నుంచి ఒక్కొక్కరు రెండుసార్లు బయోమెట్రిక్ ఇవ్వాల్సి వస్తుండడం, దానికి తోడు మిషన్లు మొరాయిస్తుండడంతో ప్రజలు చౌకదుకాణాల వద్ద బారులు తీయాల్సిన పరిస్థితి నెలొకంది. సిగ్నల్స్ సక్రమంగా అందక పోవడంతో చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకుల పంపిణీ మరింత ఆలస్యం అవుతోందని డీలర్లు చెబుతున్నారు. రేషన్ బియ్యం పంపిణీ గడువు ఆదివారంతో ముగియనుండడంతో లబ్ధిదారులు గంటల తరబడి ఎండలోనే నిరీక్షించారు. పీలేరు పట్టణం, ప్రకాశం రోడ్డులో రేషన్ షాప్ దగ్గర రాత్రి 8 గంటలకు కూడా రేషన్ బియ్యం కోసం కార్డుదారులు పడిగాపులు కాశారు. ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకంగా రేషన్ బియ్యం సరఫరా వాహనాలను సైతం సమకూర్చారు. పీలేరు మండల పరిధిలోని 15 పంచాయతీలకు 14 వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. అధికారుల పర్యవేక్షణ లోపం ఫలితంగా ఈ పథకం ఆశయం కాస్తా అక్కడక్కడ నీరుగారుతోంది. ప్రభుత్వం అమలు చేస్తూన్న పథకాలలో ఇంటింటికి రేషన్ బియ్యం పంపిణీ పథకం గురించి గొప్పగా చెప్పుకునే ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో కార్డుదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, పథకాన్ని సక్రమంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.



చౌక దుకాణం ముందు బియ్యం కోసం ఎదురుచూస్తున్న వినియోగదారులు



పథకాన్ని నీరు గారుస్తున్న రేషన్ బియ్యం పంపిణీ వాహనం


పట్టణంలో ర్యాలీ చేస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

రానున్న ఎన్నికల్లో జనసేనదే అధికారం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రానున్న 2024 ఎన్నికల్లో జనసేన పార్టీ అధికారంలోకి వస్తుందని, వైసిపి ప్రభుత్వానికి పరాభవం తప్పదని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టిన పవనన్న ప్రజాబాట కార్యక్రమం 100 వ రోజుకు చేరుకున్న సందర్భంగా మలిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ శివారులో ఉన్న ఎల్లమ్మ ఆలయం నుంచి ఆర్‌అండ్‌బి బంగ్లా, పాత బస్టాండ్ మీదుగా వజ్రం ఫంక్షన్ హాల్ వరకు కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్ అండ్ బి బంగ్లా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి ర్యాలీ కొనసాగించారు. అనంతరం వజ్రం ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాజంపేట పార్లమెంటు ఇంచార్జి సయ్యద్ ముకరం చాన్, అసెంబ్లీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రం కకావికలమైందని అన్నారు. వాలంటీర్ల ప్రజల నుండి సేకరిస్తున్న డేటాను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వారాహి యాత్ర విజయవంతం కావడంతో జనసేన ప్రభంజనాన్ని తట్టుకోలేక జనసేనకు ప్రజలలో ఉన్న ఆదరణ, అభిమానాన్ని పై బురద జల్లేందుకు వైసిపి ప్రయత్నం చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తన, లీగల్ సెల్ అధ్యక్షులు కరుణాకర్ రాజు, ఎం.వెంకటేశ్వరరావు, కత్తి సుబ్బరాయుడు, ఆకారి దినేష్, ఆకుల లక్ష్మీనరసయ్య, భాస్కర్ పంతులు, పోలిశెట్టి శ్రీనివాసులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రాహ్మణ సంఘం 28వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం బ్రాహ్మణ సంఘం 28వ వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంఘ అధ్యక్షులు పిందుకూరి నరసింహ శర్మ, ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి, మలిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు. ఇటీవల కోడూరు పట్టణంలో నిర్మాణంలో ఉన్న శంకరమఠంపై సమీక్ష జరిపారు. ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఉన్న బ్రాహ్మణులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందడమే కాకుండా ప్రజలకు భారతీయ సంస్కృతిని పెంపొందించడంలో కీలకపాత్ర పోషించాలని అన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు పెద్దిరెడ్డి, సురేంద్ర, పవన్ పాల్గొన్నారు.

రేపు ఆలయ కౌలు భూములకు వేలంపాట

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని తవళం గ్రామంలో వెలసిన శ్రీనేలమల్లేశ్వరస్వామి దేవస్థానం భూములను రైతులకు కౌలుకు ఇవ్వడానికి ఈ నెల 18న మంగళవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ మంజుల తెలిపారు. నేలమల్లేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన భూములను దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో మూడు సంవత్సరాల కాలానికి కౌలుకు ఇవ్వటానికి బహిరంగ వేలంను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయకమిటీ సభ్యులు, ఆసక్తి కలిగిన రైతులు వేలం పాటలో పాల్గొనాలని ఇఒ తెలిపారు.

పాము కాటుకు రైతు బలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి


మృతి చెందిన పి.శ్రీనివాసులు

పాము కాటుకు యువరైతు బలైన సంఘటన శనివారం రాత్రి నిమ్మనపల్లి మండలంలో చోటుచేసుకుంది. ఈ విషాదకర ఘటనపై మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. నిమ్మనపల్లి పంచాయతీ, బుర్రిరెడ్డి గారిపల్లెకు చెందిన చిన్నప్ప కుమారుడు యువరైతు పి.శ్రీనివాసులు(45) తన వ్యవసాయ బావి వద్ద పొలం పనులు చేస్తుండగా విషసర్పం కాలిపై కాటేసింది. తీవ్ర అస్వస్థతకు గురైన బాధిత రైతు కష్టం మీద ఇంటికి చేరుకుని పాము కాటేసిన విషయం చెప్పడంతో వారు వెంటనే 108 వాహనంలో మదనపల్లెకు తరలించగా జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు శ్రీనివాసులు వంట మాస్టర్‌గా స్థానికులకు సుపరిచితుడు. మృతునికి భార్య రేఖ, ఒక కుమార్తె ఉంది. రైతు మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

టిడిపి సోషల్ మీడియా కార్యకర్తలపై వేధింపులు తగవు

ప్రజాశక్తి-రామాపురం

టిడిపికి అనుకూలంగా పనిచేస్తున్న కార్యకర్తలను పోలీసులు వేధించి తప్పుడు కేసులు బనాయించడాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రామాపురంలోని హర హర ఆలయం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని రాచపల్లి పంచాయతీకి చెందిన రిషికేశకుమార్‌నాయుడు, నందనాయుడు సోషల్ మీడియాలో అనుచితంగా పోస్టులు పెట్టారని వారిని వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. రామాపురం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎస్ఐతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. టిడిపి కార్యకర్తలను టార్గెట్ చేసుకొని వేధింపులకు గురిచేయడం నిలిపివేయాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో టిడిపి విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, ఓబులేసు, దివ్యకుమార్‌రెడ్డి, మహబూబ్ బాషా, రామకృష్ణ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మారమ్మ జాతరకు చాటింపు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆరవపల్లిలో ముత్యాలమారెమ్మ తల్లి ఆలయంలో జాతర మహోత్సవాన్ని తెలియజేసే చాటింపు వేశారు. ప్రతి సంవత్సరం జిల్లా నలుమూలల నుండే కాకుండా వివిధ రాష్ట్రాల నుండి అమ్మవారి జాతరకు భక్తులు విచ్చేసి తమ మొక్కుబడులను తీర్చుకుంటారు. జాతర ఉత్సవాలు ఆగస్టు నెల 12వ తేదీ ప్రారంభమై 14వ తేదీ ముగుస్తాయని ఆలయ కార్య నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని సదుపాయాలు సమకూరుస్తున్నట్లు తెలిపారు.

కనీస సౌకర్యాలకు నోచని వారపు సంత

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రమైన సింహాద్రిపురంలో నిర్వహించే వారసంత కనీస సౌకర్యాలకు నోచుకోలేదు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఆదివారం నిర్వహించే వారపు సంత ప్రదేశంలో టాయిలెట్లు, ఇతర సదుపాయాలు లేకపోవడంతో సంతకు వచ్చిన ప్రజలు, వ్యాపారస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సంతకు మండల ప్రజలతోపాటు అనంతపురం జిల్లా ఎల్లనూరు మండల ప్రజలు వస్తుంటారు. అయితే సంత నిర్వహించే ప్రాంతంలో ఎలాంటి సదుపాయాలు లేవు. వర్షాకాలంలో మార్కెట్లో ప్రజలు, వ్యాపారస్తులు, రైతులు ఇక్కట్లకు గురవుతున్నారు. ముఖ్యంగా సంతకు మహిళలు అధిక సంఖ్యలో వచ్చి కూరగాయలను కొనుగోలు చేస్తుంటారు. అయితే కనీస సౌకర్యాలు లేకపోవడం పట్ల వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీనిపై పంచాయతీ అధికారి హరికిషోర్‌ను అడగ్గా త్వరలోనే పాత తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న స్థలంలో సంత నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీంతోపాటు ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే మార్కెట్ యార్డులో నిర్వహించేలా చూస్తామన్నారు. అక్కడ అన్ని వసతులు ప్రజలకు వ్యాపారస్తులకు కల్పించేలా చూస్తామన్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడుదాం : ఆర్‌ఆర్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి


మహిళల సమస్యలు తెలుసుకుంటున్న రమేష్‌కుమార్‌రెడ్డి

అవినీతి, అక్రమాలతో పాల్పడుతున్న అరాచక వైసిపి పాలనకు చరమగీతం పాడాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గద్దగుండ్లచావిడి, పాతకోట, ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతాల్లో రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారంటీ, ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి వైసిపి పాలనలో అవినీతి, అరాచకాలు పెరిగిపోయాయని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని కోరారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్‌సి,ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ అభివృద్ధి జరగలేదని, సంక్షేమ పథకాల పేర్లతో ప్రజలను మభ్యపెట్టి కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి నేతలు ఇసుక మాఫియా, భూకబ్జాలు, గంజాయి వ్యాపారాలు చేస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారన్నారు. చుక్కల భూములను, బీడుగా ఉన్న భూములను ఆక్రమించుకొని ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో ఇంత పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందని ప్రజలు ఊహించలేదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో రెడ్డెప్పగారి నాగేంద్రరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కలాడి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపిపి ఉమాపతిరెడ్డి, మాజీ సర్పంచ్ చెంద్రాయుడు,షేక్ మంజూర్, పార్లమెంట్ డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి షఫీ నాయక్, రవిరెడ్డి, లలిత, ముక్తర్ అహ్మద్, నిజామ్ సర్పంచ్‌లు కేశవయ్య, లక్ష్మీ నారాయణ, మోటుపల్లె శేఖర్ ,జిలాన్ భాష, దిలీప్‌రాజు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు తొలిగిన వివాదం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్


గంగమ్మ ప్రతిమ

బలిజపల్లిలో గంగమ్మతల్లి జాతర ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వివాదాలతో ఆగిపోయిన విషయం తెలిసిందే. జాతర నిర్వాహకుల మధ్య సాంప్రదాయ విషయంలో నెలకొన్న వివాదంతో జాతరకు నిర్వహణకు అడ్డంకులు ఏర్పడ్డాయి. ఎస్‌పి గంగాధరరావు బలిజపల్లెకు చేరుకుని నిర్వాహకులతో చర్చించి వేలాదిమంది భక్తుల విశ్వాసాలను దృష్టిలో ఉంచుకొని జాతర నిర్వహించాలని సూచించారు. ఈ నేపథ్యంలో గుగ్గిళ్ల సుబ్బరాయుడు కుటుంబం, గుగ్గిళ్ళ వెంకటరమణయ్య కుటుంబాలకు చెందిన నిర్వాహకులు ఈ ఏడాది జాతర నిర్వహణకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఏడాదిలో ఒక పర్యాయం మొదటిసారి గుగ్గిళ్ల సుబ్బరాయుడు కుటుంబానికి చెందిన వారు ప్రతి ఏటా శివరాత్రి నుంచి ఏప్రిల్ మాసం ముగిసే లోపు, వారి జాతర అయ్యాక అదే మాసం లోనైనా లేదా కొంత గడువిచ్చాకనైనా రెండవసారి గుగ్గిళ్ళ వెంకటరమణయ్య కుటుంబానికి చెందినవారు విడివిడిగా ఏడాదిలో రెండు సార్లు జాతర నిర్వహించుకునేందుకు నిర్ణయించారు. డిఎస్‌పి చైతన్య, సిఐ నరసింహారావు సమక్షంలో ఆమోద పత్రాల పైన సంతకాలు కూడా చేసినట్లు గుగ్గిళ్ల వెంకటరమణయ్య కుటుంబీకులు తెలిపారు. ముందుగా గుగ్గిళ్ల సుబ్బరాయుడు కుటుంబీకులు ఈనెల 20న జాతర నిర్వహణకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమా చారం.ఈ ఏడాది ఉగాది నాడు చాటింపు వేయకపోవడంతో జాతర నిర్వహణలో తమ వంతు పాత్ర నిర్వహించే నారపురెడ్డిపల్లె, అగ్రహారం గ్రామస్తులలో ఓ వర్గం వారు ఈ ఏడాది జాతర నిర్వహణకు విముఖత వ్యక్తం చేశారు. శనివారం తుమ్మల అగ్రహారం గ్రామస్తులు జాతర విషయమై ఎమ్మెల్యే మేడామల్లికార్జున రెడ్డిని కలిశారు. బలిజపల్లి గ్రామస్థులు ఆదివారం జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డిని కలిసి చర్చించారు. చివరిగా ఈ నెల 20 న గుగ్గిళ్ల సుబ్బారాయుడు కుటుంబీకులు జాతర నిర్వహణకు సంసిద్ధులయ్యారు.

20న జాతర నిర్వహణకు ఏర్పాట్లు

ఏమైనప్పటికీ జాతర నిర్వహణకు గుగ్గిళ్ళ కుటుంబం ఒప్పందం కుదుర్చుకొని ఒక నిర్ణయానికి రావడం వల్ల ఈ నెల 20న గంగమ్మ జాతర వైభవోపేతంగా జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆదివారం పోతునుపట్టి రామ్‌నగర్ నుంచి కోలాహలంగా బలిజపల్లెకు తరలించారు. భక్తులు, ప్రజలు మొక్కులు తీర్చుకునేందుకు సిద్ధం చేసుకుంటున్నారు.

నూతన వంగడాలపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-కలికిరి

95వ భారతీయ పరిశోధన మండలి దినోత్సవాన్ని కెవికె కలికిరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ జిఎస్ పాండురంగ మాట్లాడుతూ భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ద్వారా రైతులకు నూతన వంగడాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తూ రైతుల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తోందని అన్నారు. కంది పంట పండించడం ద్వారా రైతులకు లాభసాటిగా ఉంటుందని ప్రతిరోజూ మన ఆహారంలో అపరాల ప్రాముఖ్యతను వివరించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు వైవి.రమణరావు మాట్లాడుతూ ఆలస్యంగా పంటలు వేసే రైతులు చిరుధాన్యాలైన కొర్ర, రాగిసాగు చేయడం ద్వారా ఉపయోగ ఉంటుందన్నారు. సోమశేఖర్‌బాబు వివిధ పంటల్లో నీటి ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. చిరుధాన్యాల విలువాధారితో ఉత్పత్తులు తయారీ విధానం గురించి జ్యోతి వివరించారు. మామిడిలో ఇప్పుడు చేపట్టవలసిన కొమ్మ కత్తిరింపుల గూర్చి వివరించారు. డాక్టర్ ఎం.భార్గవి ఎపి మాస్ ప్రాజెక్ట్ మేనేజర్ మాట్లాడుతూ వారి సంస్థ తరపున రైతులు కావలసిన విత్తనాలు, ఎరువులు నాణ్యమైన సరసమైన ధరలకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులకు ప్రదర్శన ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానం ప్రదర్శించడం జరిగింది. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా సామూహిక ప్రదర్శనలో భాగంగా రైతులకు ఎల్ఆర్‌జి-52 కంది విత్తనాలు రైతులకు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ వై పిరుసాహెబ్, జ్ఞాన శేఖర్ పంచాయతీ సెక్రటరీ విఎఎ మాధురి, రైతులు పాల్గొన్నారు.

అలుగోగు కథలు చిరస్థాయిగా నిలుస్తాయి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాయలసీమ కథా సాహిత్యరంగంలో దర్పణం శ్రీనివాస్ రచించిన అలుగోగు కథలు చిరస్థాయిగా నిలుస్తాయని ప్రముఖ కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ వేంపల్లె షరీఫ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీనివాస డిగ్రీ కళాశాలలో గడియారం సాహితీపీఠం అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు అధ్యక్షతన దర్పణం శ్రీనివాస్ రచించిన అలుగోగు కథలు పుస్తకావిష్కరణ చేశారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ వేంపల్లె షరీఫ్ మాట్లాడుతూ ఈ పుస్తకంలో రచయిత రాయలసీమ జీవితాన్ని సీమ భాషలో అక్షరీకరించారన్నారు. కథల కోసం దర్పణం శ్రీనివాస్ కష్టపడి విషయాలు తెలుసుకొని రాశారని, ఇందుకు ఉదాహరణ దొమ్మరాట కథ పేరును ప్రస్తావిస్తూ ప్రశంసించారు. తొలుత యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎం వినోదిని అలుగోగు కథల పుస్తకాన్ని ఆవిష్కరించి తొలి కాపీని డాక్టర్ వేంపల్లె షరీఫ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వినోదిని మాట్లాడుతూ దర్పణం శ్రీనివాస్ రచన రాయలసీమ అస్తిత్వ వాదానికి దర్పణం పడుతోందన్నారు. గడియారం సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి మిరియాల శివగణపతి పుస్తక సమీక్ష చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాల అవార్డు పొందిన చదువులబాబు మాట్లాడారు. అనంతరం ప్రొద్దుటూరుకు చెందిన కవయిత్రి దుర్గా భవాని, స్థానిక ప్రభుత్వ పెన్షనర్ల సంఘం గౌరవాధ్యక్షుడు పొన్నారి దస్తగిరి, ఎస్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుకుమార్, జమ్మలమడుగు, పెద్దముడియం ఎంఇఒలు పరమేశ్వరయ్య, చౌడయ్య ప్రసంగించారు. చివరగా దర్పణం శ్రీనివాస్‌ను గడియారం సాహితీ పీఠం వారు ఘనంగా సత్కరించారు. కళాకారులు, రచయితలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెతికినా కనిపించని అభివృద్ధి : భూపేష్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : రాష్ట్రంలో కాదుకదా కనీసం నియోజక వర్గంలో కూడా ఎంత వెతికినా అభివృద్ధి కనపడడం లేదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం నియోజకవర్గంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బస్సు యాత్ర ప్రారంభించారు. ఇది ముందుగా మైలవరంలో ప్రారంభమై జమ్మలమడుగు నుంచి ముద్దనూరుకు వెళుతుంది. ఈ సందర్భంగా స్థానిక గాంధీబొమ్మ వద్ద భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు కట్టించిన టిట్కో ఇళ్లకు వైసిపి రంగులేసి ఇంతవరకు ప్రారంభించలేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కచ్చితంగా టిడిపి అధికారంలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, జమ్మలమడుగు పార్టీ పరిశీలకులు రామకృష్ణ, ముక్తియార్, లక్ష్మిరెడ్డి, వికాస్ హరి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, అన్నెబొయిన కొండయ్య, ఎస్టీ సెల్ నాయకుడు హనుమంతు నాయక్, జింకల బాషా, దువ్వూరు మురళి, పొన్నతోట శ్రీను, మల్లికార్జున, వెల్డింగ్ గైబు, సర్దార్ పాల్గొన్నారు. **ముద్దనూరు :** జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్ర ఆదివారం మధ్యాహ్నం ముద్దనూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండల నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ముద్దనూరు-జమ్మలమడుగు రహదారిలోని శివాలయం వద్ద నుండి టిడిపి దేవగుడి అభిమానులు, కార్యకర్తలు భారీ ఎత్తున బైకుల్లో ఘనంగా స్వాగతం పలికారు. టిడిపి కార్యాలయంలో భోజనం అనంతరం బస్సు యాత్ర పాత బస్టాండు నుండి నాలుగు రోడ్ల మీదుగా ఎర్రగుంట్లకు బయలుదేరింది. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, టౌన్ ఇన్‌ఛార్జి రంగారెడ్డి, మైనారిటీ నాయకులు అబ్దుల్ ఖాదర్, నాయకులు భాస్కర్‌రెడ్డి, సత్తార్, బాబా అమీర్, సన్నీ పాల్గొన్నారు.

'వైఎస్‌ఆర్ పెళ్లి కానుక'లో వివక్ష సరికాదు

వేంపల్లె : వైఎస్‌ఆర్ పెళ్లి కానుక పథకంలో కులాలు, మతాలు మధ్య జగన్ ప్రభుత్వం వివక్ష చూపడం శోచనీయమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా మూడేళ్లు వైఎస్‌ఆర్ పెళ్లి కానుక పథకాన్ని అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్నప్పటికీ వివక్ష చూపుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, ముస్లిం, క్రిష్టియన్ మైనార్టీ చెల్లెమ్మల వివాహానికి వైఎస్‌ఆర్ పెళ్లి కానుక పేరుతో లక్ష రూపాయల ఆర్థికసాయం చేస్తుండగా, బిసి చెల్లెమ్మల వివాహానికి రూ.50 వేలు మాత్రమే ఇవ్వడం అన్యాయమన్నారు. అగ్రవర్ణాల్లో అనేక మంది కటిక దరిద్రాన జీవిస్తున్నట్లు చెప్పారు.

అందరి సహకారంతోనే డిగ్రీ కళాశాల అభివృద్ధి

వేంపల్లె : ప్రభుత్వ వైఎస్‌ఆర్ వివేకానంద డిగ్రీ కళాశాల అభివృద్ధికి అందరి సహకారం అవసరమని జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ వైఎస్‌ఆర్ వివేకానంద డిగ్రీ కళాశాల ఆవరణలో కళాశాల అభివృద్ధిపై ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు ఆధ్వర్యంలో కళాశాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు యూనిఫాం, మెరిట్ విద్యార్థులకు పారితోషికాలు, బహుమతులు ఇవ్వాలని కమిటీ సభ్యులు కోరారు. కళాశాలలో పరిశుభ్రత, వీధి దీపాలకు తక్షణమే చర్యలు తీసుకుంటామని సర్పంచు రాచినేని శ్రీనివాసులు అన్నారు. మైనారిటీ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు అధ్యాపకులు కృషి చేయాలని సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్ వలి కోరారు. సమావేశంలో కళాశాల కమిటీ సభ్యులు రాజు, బాలం గోపాల్, పిఆర్ఓ బాల నారాయణ, అధ్యాపక సంఘం కార్యదర్శి బాలకొండ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

ప్రతిభకు నిదర్శనం పుట్టా ఓబులేసు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రతిభకు నిదర్శనం ఉపాధ్యాయుడు పుట్టా ఓబులేసు అని ఎంఇఎఫ్. జిల్లా అధ్యక్షుడు పిచ్చికే బాబు అన్నారు. ఆదివారం స్థానిక వివేకానంద జూనియర్ కళా శాలలో పుట్టా ఓబులేసును ఎంఇఎఫ్ సంఘం ఆధ్వర్యంలో సన్మానిం చారు. ఈ సందర్భంగా పిచ్చికే బాబు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఉపా ధ్యాయ పదోన్నతుల్లో ఓబు లేస్ ఒకవైపు ఉపాధ్యాయ వృత్తిలో తమ విధులను సమర్థవంతంగా నిర్వ ర్తిస్తూ, మరోవైపు పిహెచ్‌డి చేస్తూ, రచయితగా నిరుద్యోగ యువతకు విజయక్రాంతి, విజ్ఞానశాస్త్ర ప్రియులకు సైన్స్ అండ్ టెక్నాలజీ పుస్తకాలను రచించడం ఆయన ప్రతిభకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎంఇఎఫ్ నాయకులు కె.బాల ఓబయ్య, కె.కొండయ్య, నవీన్‌కుమార్, పి.కిరణ్‌కుమార్, పి.చంద్రశేఖర్, కె.బాల గంగయ్య, పి.భాస్కర్, కె.నాగేష్ పాల్గొన్నారు..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - చాపాడు

లక్ష్మీపేట పాఠశాలలో 1991-1992లో 10వ తరగతి చదివిన విద్యార్థుల కలయిక స్థానిక పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు సాంబ శివారెడ్డి మాట్లాడుతూ తమ వద్ద చదువుకున్న విద్యార్థులు వివిధ రంగా ల్లో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవడం, ప్రస్తుతం వారిని చూస్తే ఎంతో సంతోషంగా ఉంద న్నారు. పూర్వ విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఎన్ఆర్ఐ ద్వార్శల కొండారెడ్డి మాట్లాడుతూ 31 ఏళ్ల తర్వాత స్నేహితులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులు పుల్లారెడ్డి, జాన్ సుబ్బరాయుడు, ఆర్గనైజర్ వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి-చక్రాయపేట

మండల కేంద్రమైన చక్రాయపేటలోని రైతు భరోసా కేంద్రంలో యూరియా, డిఎపి ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆదివారం హార్టికల్చర్ అధికారి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రం వద్దకు వచ్చి తీసుకోవాలని ఆయన సూచించారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రతినిధులు, అధ్యాపకులు

ప్రాంగణ ఎంపికల్లో 22 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు చైతన్య డిగ్రీ కళాశాలలో ప్రాంగణ నియామకాలు నిర్వహిం చినట్లు ప్రిన్సిపల్ ఎం.హేమాద్రి నాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక చైతన్య డిగ్రీ కళాశాలలో ప్రముఖ సాఫ్ట్ వేర్ సంస్థలైన "మ్యాక్సిన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, క్యాపెల్ల ఈసిస్టం ప్రయివేట్ లిమిటెడ్, అబా ఆస్ట్రిం మైండ్స్ టెక్నాలజీ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వ హించారు. 142 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా వారిలో 22 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు లోకేష్ బాబు, మల్లి కార్జున, రవికు మార్‌లు అభినందించారు.

గంట నరహరి గెలుపు ఖాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


గంట నరహరిని కలిసిన ఖాదర్ ఖాన్

రాబోయే పార్లమెంటు ఎన్నికలలో రాజంపేట పార్లమెంటులో స్థానం నుండి పోటీ చేయబోయే గంట నరహరి గెలుపు ఖాయమని టిడిపి ముస్లిం మైనారిటీ నాయకులు పఠాన్ ఖాదర్ ఖాన్ ఆశాభావం వ్యక్తం చేశారు. మదనపల్లెకు విచ్చేసిన టిడిపి రాజంపేట పార్లమెంటు అభ్యర్థి గంట నరహరిని ముస్లిం మైనారిటీ నాయకులుచ పఠాన్ ఖాదర్ ఖాన్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, రాబోయే ఎన్నికలలో గెలుపు పై చర్చించారు. రాజంపేట పార్లమెంటు పరిధిలో టిడిపి బలంగా ఉందని, కష్టపడి పనిచేసే గెలుపు సులభంగా ఉంటుందని అంచనా వేశారు. గంట నర హరితోపాటు ఎన్ఆర్ఐ, శ్రీకాంత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీకాంత్ గాజులను కలిసి అభినందించారు. మదనపల్లె పట్టణంలో మొదట సారి ఫ్లడ్ లైట్ల వెలుగులో ఎంసిఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం గొప్ప విషయమని కొనియాడారు. యవత క్రీడలపట్ల ఆసక్తి చూపించే విధంగా క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయం అన్నారు.

జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్‌కు 35 మంది ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్‌కు 35 మంది ఎంపికైనట్లు ఎంఇఒ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ జట్టు ఎంపిక చేశారు. ఇందులో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు సాధ్య పడుతుందన్నారు. రోప్ స్కిప్పింగ్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28 ,29వ తేదీలలో కర్నూలులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలోనూ ప్రతిభను చాటాలన్నారు. కార్యక్రమంలో రోప్ స్కిప్పింగ్ జిల్లా కార్యదర్శి శరత్ నాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్‌కు ఎంపికైన విద్యార్థులు

క్రైం కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-రాజంపేట రూరల్


అనుమానస్పదస్థితిలో మృతి చెందిన వ్యక్తి

మండల పరిధిలోని చెయ్యేరు బ్రిడ్జి కింద గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఆదివారం రూరల్ పోలీసులు గుర్తించారు. మృతుడికి సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని, మృతుడి పక్కన పురుగులు మందు డబ్బా ఉండడం వలన ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఎస్ఐ భక్తవత్సలం మృతదేహాన్ని పరిశీలించి ఆత్మహత్య కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు


-ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-ములకలచెరువు

పిటిఎం మండలంలోని చేలూరు వద్ద శనివారం అర్ధరాత్రి రెండు బైకులు ఎదురెదురు ఢీకొని సత్యసాయి జిల్లాకు చెందిన ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ రవీంద్ర బాబు కథనం మేరకు.. సత్యసాయి జిల్లా, తనకల్లు మండలం, ఎరబల్లికిచెందిన వనజ(25) తన కొడుకు గౌతమ్(8) జన్మదిన వేడుకలను కర్ణాటక రాష్ట్రం అబ్బురోళ్లపల్లిలో జరిపేందుకు పుట్టినింటికి శనివారం రాత్రి బైక్‌లో బయలుదేరారని చెప్పారు. స్కూటర్ మార్గ మధ్యంలోని పిటిఎం మండలం చెలూరి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న మరో బైక్ వనజ కుటుంబికులు ప్రయాణిస్తున్న బైకును ఢీకొని వెళ్లి పోయిందన్నారు. ఈ ప్రమాదంలో వజన, ఆమె కొడుకు గౌతమ్(8), కూతురు సుతిశ్రీ(6), తమ్ముడు విశ్వనాథ్(20), మరిది విష్ణువర్ధన్(15) తీవ్రంగా గాయపడ్డారనిచెప్పారు. బాధితులను స్థానికులు గమనించి ఓ ప్రయివేట్ వాహనంలో హుటాహుటిన బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు ఐదుగురికి మెరుగైన చికిత్సలు అందించారు. గాయపడిన వారిలో విశ్వనాథ పరిస్థితి విష మంగా ఉండడంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేయగా వారు బెంగుళూరుకు వెళ్లారు. ఘటనపై పిటిఎం పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నీటిలో మునిగి వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్


మృతి చెందిన పోతురాజు

మండలంలోని రాయలపురం బ్రిడ్జి దగ్గర ఉన్న వంక వద్ద ఉన్న నీటిలో స్నానం చేసేందుకు వెళ్లి ఆదివారం ఒంగోలుకు చెందిన బేల్దారి కార్మికుడు చిన్నతోటి పోతురాజు (38) మృతి చెందాడు. కొంతకాలం నుంచి పులివెం దుల మోడల్ టౌన్‌లో పోతురాజు కూలి పనులు చేసుకుంటున్నాడు. ఆదివారం అతను వంకలో సరదాగా ఈత కొడుతూ ఒక్కసారిగా నీళ్లలో మునిగిపోవడంతో అక్కడే ఉన్న పలువురు కూలీలు వెంటనే పోలీస్, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు సంఘటనాస్థలం చేరుకుని మునిగిపోయిన పోతు రాజు ను బయటకు తీశారు. అప్పటికే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోతురాజు ప్రకాశం జిల్లా ఉలవలపాడు గ్రామానికి చెందిన వ్యక్తి. అతనికి ముగ్గురు పిల్లలున్నారని తెలుస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మొక్కల పెంపకం ఆధునిక నాగరికతకు సంకేతం

కడప అర్బన్ : మొక్కలు నాటడం, సంరక్షించడం ఆధునిక నాగరికతకు సంకేతమని ఎల్ఐసి కడప డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్ అన్నారు. ఆదివారం ఎల్ఐసి 'సెంట్రల్ ఆఫీస్ నిర్దేశం మేరకు డివిజన్‌లో అన్ని కేంద్రాల్లో చేపడుతున్న మొక్కల పెంపకం కార్యక్రమాన్ని లాంఛనప్రాయంగా మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, సామాజిక, పాలనాపరమైన కార్యకలాపాల్లో భాగంగా ఎల్ఐసి 'ప్లాంట్ ఎ లైఫ్' కార్యక్రమానికి పిలుపునిచ్చిందన్నారు. ప్రమాణాల రీత్యా ఎల్ఐసి బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తోందని చెప్పారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వల్ల జరిగే నష్టాలు, పరిణామాలు అందరికీ ప్రస్తుతం తెలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో సంస్థలుగా, ప్రజలుగా మొక్కల పెంపకాన్ని ఉద్యమ స్థాయిలో చేపట్టాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్లు సత్యప్రసాద్, సత్యశ్రీనివాస్, అధికారులు శ్రీనివాస్, పద్మజ, వెంకటకృష్ణ, విజయకుమార్ రెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి పోరాటాలు

సిఎం హామీలు అమలు చేయాలి
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

కార్మిక సమస్యల పరిష్కారం కోసం సిఐటియు పోరాటాలు నిర్వహిస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికులు, రిమ్స్, విఆర్ఎ కార్మికులకు రూ.26 వేలు వేతనాలు ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో కార్మి కుల సమస్యలు పరిష్కరిస్తారో వారికి మాత్రమే ఓటు అడిగే హక్కు ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్, కాంట్రాక్ట్, గ్రామపం చాయతీ, అంగన్‌వాడీలు చలో విజయవాడకు సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఈ నెల 20,21 అన్ని మండలాల్లో రిలే దీక్షలు, 27 పట్టణాల్లో ఆందోళనలు ఉంటాయని, ఆగస్టు 7న కలెక్టరేట్ ఎదుట ఆందోళన, 14 నుంచి 27 వరకు చలో విజ యవాడకు సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు. అంగన్‌వాడీలు పెద్దఎత్తునా పోరటం చేసిన స్పందించకపోవడం దుర్మార్గమని చెప్పారు. సమావేశంలో సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, జిల్లా కోశాధికారి లక్ష్మిదేవి, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడతున్న మనోహర్

తీర్పును బట్టి భవిష్యత్తు కార్యాచరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

డిగ్రీ కళాశాలల పట్ల ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ ఫీజుల అంశం హై కోర్టు పరిధిలో ఉన్న దృష్ట్యా మంగళవారం న్యాయస్థానం తుది తీర్పును బట్ట భవిష్యత్తు కార్యారణ, విద్యా సంస్థల మనుగడ గురించి చర్చిస్తామని డిగ్రీ కళాశాలల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం నాగార్జన డిగ్రీ కళాశాలలో వీవైయూ అనుబంధ డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్లు అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థల మనుగడపై చర్చించామని పేర్కొన్నారు. నిర్ధారించిన ఫీజులు సమంజసంగా లేదని చెప్పారు. వాటిని మరోసారి పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. అడ్మిషన్లు 25 శాతం కంటే తక్కువ ఉన్న కళాశాలలను ముందస్తు సమాచారం లేకుండా 2023-24 విద్యా సంవత్సరానికి అనుమతి లేదంటూ (రాష్ట్ర వ్యాప్తంగా 30 కళాశాలలు) రద్దు చేయడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. వెంటనే అనుమతించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ప్రభుత్వ వైఖరి మారకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో అసోసియేషన్, వైవీయూ ఇసి సభ్యులు సుబ్బారెడ్డి, కరస్పాండెంట్లు రామకృష్ణారెడ్డి, విజయ్ కుమార్, సాయికృష్ణ, నరసింహులు, సురేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసులు



30 వరకు చేనేత, హస్తకళల ప్రదర్శన..అమ్మకాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని మద్రాస్ రోడ్డులో ఉన్న టిటిడి కల్యాణమడపంలో శ్రీకళాజ్యోతి హ్యాండ్‌క్రాఫ్ట్స్ వెల్ఫేర్ సొసైటీ వారు చేనేత, హస్తకళల ప్రదర్శన, అమ్మకాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 30 వరకు కొన సాగుతుంది. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మకాలు నిర్వహిస్తారు. **చేనేత వస్త్రాలు :** హైదరాబాద్ బ్లాక్ ప్రింటింగ్ శారీస్, బెంగాలి కాటన్, మంగళగిరి నారాయణపేట, దర్మవరం, పోచంపల్లి, మధ్యప్రదేశ్, టస్కర్, భాగలపూర్ స్కిల్ చీరలు, లక్నో చికెన్ చీరలు అందుబాటులో ఉన్నాయి. **డ్రస్‌మెటీరియల్:** కలంకరి, మంగళగిరి, చీరాల, పోచంపల్లి, నారాయణపేట, నారాయణవనం అందుబాటులులో పెట్టారు. **బెడ్‌షీట్స్:** కలంకారి, పోచంపల్లి, జైపూర్, హర్యానా బెడ్‌షీట్స్, గజరాజ్ టాప్స్, తిరుపూర్ బాబే చెప్పల్స్, ఖాధీ మెటీరియల్స్, డ్రస్ మెటీరియల్స్, తిరుపూరి గ్రార్మెంట్స్, బుక్స్, డోర్‌కర్టన్స్, ఖాదీషర్ట్స్, జ్యూట్, లెదర్ బ్యాగ్స్ ప్రదర్శనలో ఉంచారు. **హస్తకళా వస్తువులు:** హైదరాబాద్ ముత్యాలు, ఆభరణాలు, గోల్డ్ కవరింగ్ ఆభరణాలు, కొండపల్లి,ఏటికొప్పాక, చెక్కబొమ్మలు, లాక్‌బాంగిల్స్, హెర్బల్ పౌడర్స్‌కెస్‌మెదురు, మెట్‌మెటల్స్, బ్లాక్ అండ్ వైట్ బొమ్మలు ఉన్నాయి.

ముస్లిం మైనార్టీలను ఓటు బ్యాంకుగా చూడొద్దు

పోరుమామిళ్ల : ముస్లిములకు అందజేస్తున్న ప్రభుత్వ పథకాలను యధావిధిగా కొనసాగించాలని, వారిని ఓటు బ్యాంకుగా చూడొద్దని అవాజ్ జిల్లా అధ్యక్షులు చాంద్ బాషాపేర్కొన్నారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆవాజ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆవాజ్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆవాజ్ ఆయన మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో జగన్మోహన్ రెడ్డికి రాష్ట్రంలో ఉన్న ముస్లిం మైనార్టీ లందరూ ఓట్లు వేసి 151 స్థానాల్లో గెలవడానికి గెలిపించారని చెప్పారు. ముస్లిముల సంక్షేమానికి ప్రత్యేక కొత్త పథకాలు ఇస్తారనీ చాలామంది భావించారన్నారు. కొత్త పథకాలు ఏవి రాకపోగా గత కాలంలో మైనార్టీల సంక్షేమానికోసం అమలు చేస్తున్న పాత పథకాలన్నీటిని ఈ ప్రభుత్వం నిలిపేసిందన్నారు. ఇప్పటికైనా ముస్లిం మైనార్టీ ప్రజలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. హక్కుల సాధన కోసం ఈనెల 24న ఉదయం 10 గంటలకు విజయవాడలో అలంకార్ థియేటర్ ధర్నా చౌక్ నందు ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఉన్న ముస్లిం మైనార్టీ సోదరులందరూ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా కమిటీ నాయకులు అన్వర్ బాష, ఖాదర్‌బాష, మస్తాన్, బడే పీరా, మహబూ పీర్, మహబూబ్ బాషా, ఆవాజ్ మహిళా నాయకురాలు ,గౌసియా బేగం , పోరుమామిళ్ల ఆవాజ్ నాయకులు మస్తాన్, నజీర్, నన్నే పీరా పాల్గొన్నారు.

ఎపిఎన్ఆర్‌టిఎస్ సేవలు అభినందనీయం

కడప : కువైట్ ఆంధ్రప్రదేశ్ నాన్ ప్రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఎపిఎన్ఆర్‌టిఎస్) సేవలు అభినందనీయమని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. కష్టాలలో ఉన్న ప్రవాసాంధ్రుల సమస్యలను పరిష్కరిస్తున్న కువైట్ వైసిపి ఎపి ఎన్ఆర్‌టిఎస్ సభ్యులకు రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కమలాపురానికి చెందిన షేక్ మౌలాలి కువైట్‌లో ఇబ్బందులు పడుతుంటే ముమ్మడి బాలిరెడ్డి అండగా నిలబ డడం గొప్పవిషయమన్నారు. బాధితుడు మౌలాలికి ఉండేందుకు వసతి భోజన సదుపాయం కల్పించిన జగన్ సైన్యం అధ్యక్షులు మహబూబ్ బాషా, టికెట్ కోసం సహకారం అందించిన సభ్యులను అభినందించారు.

నగరంలో ర్యాలీ

కడప అర్బన్ : పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం శాఖహార ర్యాలీ నిర్వహించారు. ఆదిత్య కల్యాణ మండపం నుంచి మొదలై శ్రీనగర్ కాలనీ వరకు రాగిసంది. కడప పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఊర్మిలాదేవి, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు ఓబయ్య, గజ్జల రామసుబ్బారెడ్డి, జి.వి.ఎస్.రెడ్డి, సంజీవి, మురళీ, ప్రసాద్, ప్రభాకర్, శర్వాణి, అరుణకుమారి, వెంకటసుబ్బయ్య, శ్యామల, కృష్ణవేణి ర్యాలీలో ప్లకార్డులతో నిర్వహించారు. శాఖహారం వల్ల ఎన్నోలాభాలు, నిత్య జీవి తంలో ధ్యానం గురించి నినాదాలు చేస్తూ ప్రజలను చైతన్యపరచారు.

కెఎస్ఆర్ఎంలో చదవడం గర్వంగా ఉంది

కడప అర్బన్ : కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో చదవడం ఎంతో గర్వంగా ఉందని పూర్వపు విద్యార్థులు అన్నారు. ఆదివారం కళాశాల 1994-98 బ్యాచ్ ట్రిపుల్ ఇ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు స్పందిస్తూ తాము దేశ, విదేశాలలో ఉన్నత రంగాలలో స్థిరపడ్డామని పేర్కొన్నారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ,ఉపాధి అవకాశాలను తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. గురువులు, యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అప్పటి జ్ఞాపకాలను, తీపి గుర్తులను గుర్తు చేసుకున్నారు. కళాశాల ఎమ్‌డి కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ దేశ, విదేశాలలో ఉన్నత రంగాలలో స్థిరపడిన విద్యార్థులను చూసి సంతోషంగా ఉందని చెప్పారు.

భూ కబ్జా ముఠాను అరెస్టు చేయాలి : వ్య.కా.స

ప్రజాశక్తి - బద్వేలు

బద్వేల్ మున్సి పాలిటీ పరిధిలోని చెన్నంపల్లి రెవెన్యూ పొలం సర్వే నంబర్ 1393 ప్రయివేట్ ల్యాండ్ అని తెలిసినప్పటికీ అను గోలు చిన్న సుబ్బారెడ్డి భూ కబ్జాకు పాల్పడుతూ దౌర్జన్యం చేస్తున్నారని వారిపై వెంటనే ల్యాండ్ గ్రాఫింగ్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి అన్వేష్ డిమాండ్ చేశారు. ఆదివారం భూ కబ్జాదారులు ధ్వంసం చేసిన కంచెను పరిశీలించిన అనంతరం స్థానిక సిపిఎం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగనపల్లి లక్ష్మీదేవి తన పూర్వీకుల నుంచి తనకు సంక్రమించిన రిజిస్టర్ సాగు భూమిని అనుగోలు చిన్న సుబ్బారెడ్డి గతంలోనూ పలుమార్లు భూకబ్జాకు పాల్పడ్డారని తెలిపారు. భూకబ్జా కేసులు నమోదు చేశారని చెప్పారు. అయినప్పటికీ పోలీసులు అరెస్టు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని పేర్కొన్నారు. అతనే తిరిగి శనివారం అనుచరులతో భూ కబ్జాకు పాల్పడి లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన కంచెను ధ్వంసం చేశారని, వారిపై చర్యలు తీసుకొని అరెస్టు చేయాలన్నారు. లేకపోతే త్వరలో బాధితులతో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.సి. మనెయ్య, దళిత సీనియర్ నాయకులు ప్రసాద్, పూలే అంబేద్కర్ రాజ్యాధికార రాష్ట్ర అధికార ప్రతినిధి పిచ్చయ్య, ఐద్వా సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బమ్మ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, సిఐటియు జిల్లా కార్యదర్శి జిల్లా అధ్యక్షులు చాంద్ బాష, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ ,డివైఎఫ్ఐ అధ్యక్షులు ముడియం చిన్ని, ఆటో యూనియన్ కార్యదర్శి రమణయ్య, మస్తాన్, ఐద్వా సంఘం మహిళా కార్యదర్శిలు మోక్షమ్మ ,అనంతమ్మ, జిల్లా కమిటీ సభ్యులు గౌతమి, మస్తాన్ బి ,ఆవాజ్ నాయకులు మస్తాన్, బిల్డింగ్ వర్కర్స్ కార్యదర్శి రాయప్ప, ఇబ్రహీం, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్య.కా.స జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్

ప్రాజెక్టుల పనులను పరుగులు తీయిస్తాం

- రూ.454 కోట్లతో పరిహారం చెల్లింపులకు కసరత్తు
- రూ.12.10 కోట్లతో లీకేజీ పనులకు ప్రతిపాదనలు
- జిఎన్ఎస్ఎస్ పరిధిలోని ప్రాజెక్టుల్లో 38 టిఎంసిల నీటి నిల్వ
- జిఎన్ఎస్ఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి -కడపప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పనుల్ని వేగవంతం చేస్తున్నాం. ఇందుకుగానూ సుమారు రూ.400 కోట్లతో 3.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించే పనులపై దృష్టి సారించాం. చిన్న, మధ్యతరహా, భారీ సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో తక్కువ వ్యయంతో కూడిన డిస్ట్రి బ్యూటరీ పనులు చేపడుతున్నాం. ఉమ్మడి రాష్ట్రంలోనే పెద్దదైన మొగమేరు అక్విడక్ట్‌ను పూర్తి చేయడంపై దృష్టి సారించామని గాలేరు-నగరి సుజల స్రవంతి పథకం సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎం.మల్లికార్జునరెడ్డిని ప్రజా శక్తి కలిసిన సందర్భంగా ముఖాముఖి..



ముఖా ముఖి..

జిఎన్ఎస్ఎస్ పరిధిలోని ప్రాజెక్టుల గురించి తెలపండి?

జిఎన్ఎస్ఎస్ పరిధిలో 11 ప్రాజెక్టులున్నాయి. గండికోట, గండికోట మెయిన్ కెనాల్, అలవలపాడు లిఫ్ట్, జిఎన్ఎస్ఎస్ హెచ్ఎన్ ఎస్ఎస్ లిఫ్ట్, సిబిఆర్- ఎర్రబల్లి లిఫ్ట్, గండికోట-సిబిఆర్- పైడిపాలెం అప్‌గ్రెడేషన్, మైక్రోఇరిగేషన్-సిబిఆర్, జికెఎల్ఐ, పిబిసి కెనాల్స్, సిబిఆర్, వామికొండ, సర్వరాయసాగర్, మైలవరం ప్రాజెక్టులున్నాయి.

సాగునీటి ప్రాజెక్టుల నీటి నిల్వల సామర్థ్యం ఎంత?

జిఎన్ఎస్ఎస్ సాగునీటి ప్రాజెక్టులు 52 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలోని జిఎన్ఎస్ఎస్ పరిధిలోని పలు రిజర్వాయర్లలో 38 టిఎం సిలు నిల్వ ఉన్నాయి.

డిస్ట్రిబ్యూటరీ పనుల వివరాలు తెలపండి?

జిఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ కింద 92 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం 45 వేల ఎకరాలకు డిస్ట్రిబ్యూటరీ సదుపాయాల కల్పనకు కృషి జరుగుతోంది. సర్వరాయసాగర్ కింద 25 వేలు, వామికొండ కింద 10 వేల ఎకరాలు, జిఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ 0 నుంచి 66 కిలో మీటర్ వరకు 10 వేల ఎకరాలు ఉంది. డిసెంబర్ నాటికి 35 వేల ఎక రాలకు నీటిసదుపాయం కల్పించడం జరుగుతోంది. ఇందుకు గానూ 60 కోట్లతో కూడిన పనులు చేపట్టడమైంది.

గండికోట పరిహారం చెల్లింపుల గురించి తెలపండి?

గండికోట నిర్వాసిత గ్రామాలైన ఫేజ్-1లో 14 గ్రామాలు, ఫేజ్-2లో నాలుగు గ్రామాలు, ఫేజ్-3లో మూడు గ్రామాలు వెరసి 21 గ్రామాల పరిధిలో 17,809 పిడిఎఫ్‌లు ఉన్నాయి. ఇప్పటివరకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించడమైంది. ఇందులో తాళ్లప్రొద్దుటూరు, చామలూరు, ఎర్రగుడి, పి.అనంతపురం, ఏటూరు, రేగడపల్లి, కె.సుగమంచిపల్లి గ్రామాల పరిధిలో 999 పిడిఎఫ్‌లకు సంబంధించి ఓటిఎస్ కింద రూ.10 లక్షలు, ఆర్అండ్ఆర్ కేటగిరీ కింద రూ.6.75 లక్షలు చెల్లించడమైంది. కొత్త రేటు ప్రకారం రూ.ఏడు లక్షలు నగదు, ఐదు సెంట్లు స్థలం కేటా యించడం జరుగుతోంది.

గండికోట పరిహారం విలువ ఎంత?

రూ.999 పిడిఎఫ్‌లకు సంబంధించి రూ.454 కోట్లు కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉంది.గతంలో సిఎం ఇచ్చిన హామీ అమలులో భాగంగా రూ.454 కోట్లు తాజాగా విడుదల చేయడమైంది. త్వరలో పంపిణీ చేయడానికి సంబంధించిన కసరత్తు ఊపందుకుంది.

అదనపు ఆయకట్టు గురించి చెప్పండి?

జిఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ నిర్మాణాలకు రూ.400 కోట్లు విడుదల చేస్తే జిల్లాలోని ఆరు లక్షల ఎకరాల్లో మూడు లక్షల ఎకరాలకు డిస్ట్రిబ్యూటరీల ద్వారా నీటిని అందిస్తాం. ఇందులో పులివెందుల నియోజకవర్గ పరిధిలోనే 1.66 లక్షల ఎకరాలకు డిస్ట్రిబ్యూటరీల ద్వారా సాగునీరు అందించే అవకాశం ఉంది. పులివెందుల పరిధిలోని 1.65 లక్షల ఎకరాల్లో 1.22 లక్షల ఎకరాలు మైక్రో ఇరిగేషన్ కింద అందుబాటులోకి వస్తుంది. ఈమేరకు ప్రాజెక్టుల వారీగా డిస్ట్రిబ్యూటరీ నిర్మాణ పనులపై సర్వే చేపట్టాల్సి ఉంది.

సర్వరాయసాగర్ లీకేజీ పనుల సంగతేమిటి?

రూ.212 కోట్లతో సర్వరాయసాగర్ ప్రాజెక్టు పనులకు టెండర్లు పిలిచాం. ఇందులో లీకేజీ పనులకు సంబంధించి రూ.5.50 కోట్లు, వామి కొండ కింద రూ.6.6 కోట్ల వ్యయంతో కూడిన ప్రతిపాదనలు పంపిం చడమైంది. పాలనామోదం లభించింది. ఇందుకూరు గ్రామంలో భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లింపులు ప్రయత్నం చేస్తున్నాం. టెండర్ దశను అధిగమించాం. వారం రోజుల వ్యవధిలో గ్రౌటింగ్ పనులు చేపడతాం.

మైక్రో ఇరిగేషన్ పనుల తీరుతెన్నుల గురించి వివరించండి?

రూ.1260 కోట్లతో డ్రిప్ ఇరిగేషన్ చేపట్టడమైంది. జికె ఎల్ఐ పరిధిలోని 800 సంపుల్లో ఇప్పటికి 120 సంపులు పూర్తి చేయడమైంది. మిగిలిన నిర్మాణాలను పూర్తి చేయడంపై దృష్టి సారించాం. ఎల్ఎ సం బంధించిన సమస్య కొనసాగుతున్నందున ఆలస్యంగా సాగుతోంది. ఏదే మైనప్పటికీ సాధ్యమైన మేరకు త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రాధాన్యత ఇచ్చాం.

మైలవరం రిజర్వాయర్ల కట్టల పునరుద్ధరణ ఎప్పుడో?

రూ.88 కోట్లతో ప్రతిపాదనలు పంపించడమైంది. రాష్ట్రప్రభుత్వ ఆమోదం లభించాల్సి ఉంది. మైలవరం రిజర్వాయర్ పరిధిలోని 75 వేల ఎకరాలకు ఆయకట్టు నీరందిస్తాం. ఇందులో 55 వేల ఎకరాలకు సాగు నీటిని అందించడమైంది. చిత్రావతి రిజర్వాయర్ల కట్టలు కుంగిన మాట వాస్తవమే. ఎడమ వైపు ప్రొటెక్షన్ గ్రిడ్‌వాల్ టెండర్ పిలిచే పనుల్లో నిగమ్న మయ్యాం. రివిట్‌మెంట్ ముందుభాగంలో 15 మీటర్ల ఎత్తు 300 మీటర్ల పొడవునా 10 లొకేషన్లలో రివిట్‌మెంట్ కుంగిన మాట వాస్తవమే. రీప్లేస్ చేయడానికి రూ.14 కోట్ల టెండర్లు పిలిచే పనుల్లో ఉన్నాం.

కాలేటివాగు ప్రాజెక్టు పురోగతిని వివరించండి?

: పిఎల్ఆర్ కాంట్రాక్టు సంస్థ రూ.5,0030 కోట్లతో టెండరును దక్కిం చుకుంది. రూ.4,300 కోట్ల పనుల్లో ఇప్పటి వరకు 20 శాతం పను లు చేపట్టింది. 2023 డిసెంబర్ నాటికి కాలేటివాగు పనుల్ని పూర్తి చేస్తాం. జిఎన్ఎస్ఎస్ నంచి హెచ్ఎన్ఎస్ఎస్ ఎత్తిపోతల పథకం పనులి వి. కడప జిల్లాలోని మొదటి భాగంలో భాగమైన కాలేటివాగు. కడప జిల్లాలో 40 వేలు, అన్నమయ్య జిల్లాలో లక్ష ఎకరాలు, చిత్తూరు జిల్లాల్లో 1.50 లక్షల ఎకరాలు వెరసి 2.90 లక్షల ఎకరాల ఆయకట్టు అందుబా టులోకి రానుంది.

చిత్రావతి-ఎర్రబల్లి ఎత్తిపోతల పనుల పురోగతి తెలపండి?

రూ.850 కోట్లతో చిత్రావతి-ఎర్రబలి ఎత్తిపోతల పనులు చేపట్టాం. వేముల మండలంలోని గిడ్డంగివారిపల్లి దగ్గర పనులు జరుగుతున్నాయి. చిత్రావతి రిజర్వాయర్ నుంచి గిడ్డంగివారిపల్లి వరకు 48 కి.మీటర్ల పైప్‌లైన్ పనుల్లో నాలుగు కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేశాం. రెండు టిఎంసిల నీటిని ఎత్తిపోతల ద్వారా పంపింగ్ చేయాల్సి ఉంది. ఇందులో వేముల, వేంపల్లి ప్రాంతాల్లోని ఆరు చెరువులను నిం పా ల్సి ఉంది. అనంతరం వేంపల్లిలోని గిడ్డంగివారి పల్లి చెరువును నీటిని సర ఫరా చేయడం ద్వారా 10 వేల ఎకరాల అదనపు ఆయకట్టు లభించే అవ కాశం ఉంది. ఎర్రబల్లి ఎత్తిపోతల పనుల వల్ల యుసిఐఎల్ పరిధిలోని ఆరు నిర్వాసిత గ్రామాలకు శుద్ధ జలాన్ని అందిస్తాం.

రాయలసీమ డ్రౌట్ మిటిగేషన్ ప్రాజెక్టు పురోగతి ఎలా ఉంది?

కడప జిల్లాలో రూ.11 వేల కోట్లతో రాయలసీమ డ్రౌట్ మిటిగే షన్ ప్రాజెక్టు పనుల్ని వేగవంతం చేశాం. సుమారు రూ.7,500 వేల కోట్లతో పనుల్ని చేపట్టడమైంది. దీంతో సుమారు 3.50 లక్షల ఎకరాల స్థిరీకరణకు అవకాశం ఉంది. ఐదు లక్షల మందికి తాగునీటిని అందించే అవకాశం ఉంది. ఉమ్మడి కడప జిల్లాలో రూ.500 కోట్లతో జిఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ విస్తరణ, రూ.650 కోట్లతో గండికోట లిఫ్టు స్కీమ్ పనుల తోపాటు మరో రూ.350 కోట్లతో ఇతర పనుల్ని చేపట్టడం జరిగింది.

రైతును వ్యాపారస్తుడిని చేయడమే

ఆర్ఎం కిసాన్ ధ్యేయం

- అధునాతన పరికరాలతో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు
- ఆర్ఎం కిసాన్ సెంటర్ వ్యవస్థాపకులు రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - కమలాపురం

ప్రతి రైతునూ వ్యాపారస్తుడిని చేయడమే ఆర్ఎం కిసాన్ ధ్యేయమని ఆర్ఎం కిసాన్ సెంటర్ వ్యవస్థాపకులు రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజ కవర్గంలోని వీరపునాయునిపల్లె మండలం ఎన్.పాలగిరి గ్రామంలో ఆదివారం ఆర్ఎం కిసాన్ సెంటర్‌ను కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్సీసీ ఛైర్మన్ మల్లిఖార్జునరెడ్డి, రాష్ట్ర అగ్రికల్చర్ సలహాదారుడు తిరుపాల్ రెడ్డి, ఆర్టికల్చర్ సలహాదారుడు ప్రసాద్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ కొన్నేళ్ల కిందట ప్రతిభ బయోటెక్ సంస్థను స్థాపించి 60 మంది ఉద్యోగులతో వ్యవసాయాధారిత ఉత్పత్తులను రైతులకు అందిస్తూ నేడు ఈ స్థాయికి చేరామని చెప్పారు. ప్రస్తుతం సంస్థలో సుమారు 700 మంది ఉద్యోగులు ఉన్నారన్నారు. అధునాతన పరికరాలతో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఇక్కడ అందుబాటులో ఉందని చెప్పారు. రైతులు తమ వ్యవసాయ పొలాలకు సంబందించిన మట్టి, నీరు, ఎరువులు ఆయా భూములకు సరిపడే విధంగా పరీక్షలు చేసి సలహాలు ఇస్తారని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు ఇందులో భాగంగా ప్రతి శనివారమూ వంద మంది రైతులకు అన్ని వసతులు కల్పిస్తూ భోజన వసతి కూడా ఏర్పాటు చేసి వ్యవసాయంపై అధునాతన విధానాలు, ఏయే పంటలకు ఏవేవి అవసరం ఏవిధంగా అత్యధిక లాభాలు పొందవచ్చో అనే అంశాలపై తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సంస్థకు అడిగిన వెంటనే సర్వరాయ సాగర్ నుంచి నీటిని అందించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో భారత్ బయోటెక్ పరిశ్రమ ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. కరువు ప్రాంతమైన ఇక్కడ ఈ పరిశ్రమ రావడంతో రైతులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. రైతుల కోసం ఏర్పాటుచేసిన సంస్థను ఉపయోగించుకుని మంచి ఫలితాలు పొందాలని తెలియజేశారు.


కిసాన్ సెంటర్ ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులతో రాజశేఖర్‌రెడ్డి

డెమో ఫిల్మ్ 'ఉల్ఫ్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరం లోని ఏడు రోడ్ల వద్ద ఉన్న మిస్టర్ వీ ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం అఫ్జల్ బాయ్ దర్శకత్వంలో దబీచ్ హౌస్ ఫేం పవన్ హీరోగా నటించిన డెమో ఫిల్మ్ 'ఉల్ఫ్' పోస్టర్ ఆవిష్కరించారు. ప్రముఖ నటుడుచ షా ఫిల్మ్ సంస్థ వ్యవస్థాపకులు పెద్ద పులి భరత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా నేషనల్ ప్లేయర్ రిప్లె షూటర్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జాకీర్ హుస్సేన్, ట్రావెల్స్ అధినేత నాగరాజు హాజరాయ్యరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాకు చెందిన ఎంతో మంది గొప్ప కళాకారులు, సాహితీ వేత్తలు ఉన్నారని చెప్పారు. కృషి, పట్టుదలతో యువతీ యువకులు ఆయా రంగాల్లో రాణించ వచ్చున్నారు. ఎంతో మంది ప్రతిభ గల వ్యక్తులు సరైన ప్రోత్సాహం లేక వెనుక బడి ఉన్నారని పేర్కొన్నారు. ఇలాంటి వారికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం డైరెక్టర్ అఫ్జల్ భాయ్ మాట్లాడుతూ సమాజంలో మేక వన్నె పులులు ఉన్నాయని, అలాంటి వ్యక్తుల కథాంశంతో ఈ ఉల్ఫ్ షార్ట్ ఫిల్మ్ తీస్తున్నామని పేర్కొన్నారు. హీరో పవన్ మాట్లాడుతూ మనిషికి నైతిక విలువలు ఎంతో అవసరమన్నారు. దర్శకుని ఆలోచన మేరకు ఎంతో చక్కగా చిత్రీకరణ జరుగుతోందని చెప్పారు. దీనికి పాటలు రాము, డిఒపి ఎడిటింగ్ సరోజ, శైలజా నిర్వహించారు. ఇందులో స్థానిక కళాకారులు తాళ్ళపల్లె ప్రసాద్, జార్జి, వివి వర్మ, ఇస్మాయిల్, సుబ్బు, హరి, సురేంద్ర, సమీర్,శివ, నాగముని పాల్గొన్నారు.

వంట గది లేక అవస్థలు - పట్టని అధికారులు

ప్రజాశక్తి-కాశినాయన

మండల కేంద్రమైన నర సాపురంలోని ఎపి మోడల్ పాఠశాలలో వంట గది లేక వంట ఏజెన్సీలు ఇబ్బం దులు పడుతున్నారు. సుమారు పదేళ్ల కిందట ఇక్కడ మోడల్ స్కూల్ ఏర్పా టైంది. ఆ పాఠశాలలో దాదాపు 400 మంది విద్యార్థు లున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వంటశాల ఏర్పా టు చేయకపోవడంతో ఆరుబయటే వంట చేస్తున్నారు. మొన్నటి వరకు పూరిగుడిసెలో వంటలు చేస్తు న్నారు. ఇటీవల పాఠశాల తాపల కింద వంటలు చేస్తున్నారు. జిల్లా అధి కారులు ఆ పాఠశాలకు తనిఖీ నిమిత్తం ఎన్ని పర్యాయాలు వచ్చిని పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. వంటశాల లేకపోతే వం టలు ఏ విధంగా చేస్తారని అనేది జిల్లా అధికారులకు తెలియదా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఆ చిన్న గదిలో వంట ఏజెన్సీలు పడే ఇబ్బం దులు అన్నీ ఇన్నీ కావు. అన్ని సక్రమంగా ఉన్న వంటశాల లేకపో వడంపై పలు వురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాధికారులు వంట శాలను ఏర్పాటుచేసి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


తాపల కింద వంట చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకురాలు

వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆవిర్భావం

కడప అర్బన్ : జిల్లాలోని సాహితీవేత్తలతో, సాహిత్యాభిమానులతో 'వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం' ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రముఖ కథారచయిత షేక్.హుస్సేన్ సత్యాగ్ని పేర్కొన్నారు. ఆదివారం పలువురు సాహితీవేత్తలతో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సమావేశం నిర్వహించారు. జిల్లా రచయితల సంఘం ఏర్పాటు ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కొత్త సంస్థ ద్వారా విద్యార్థులకు సాహిత్యాన్ని చేరువ చేయడం, యువ రచయితలను ప్రోత్సహించడం, మహాసభలు జరిపి ప్రజల్లో సాహిత్యోత్సాహాన్ని నింపడం, రచయితల శిక్షణ తరగతులు, సాహితీ సదస్సులను నిర్వహించడం, మాతృభాష ఔన్నత్యాన్ని తెలియజేయడానికి కృషి చేయడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తదనంతరం షేక్‌హుస్సేన్ సత్యాగ్ని జిల్లా రచయితల సంఘం కార్యవర్గాన్ని ప్రకటించారు. రిజిస్ట్రేషన్ త్వరలో పూర్తి చేస్తామని, ఈ ఏడాది చివరలో మహాసభలు నిర్వహిస్తామన్నారు.

నిఖా వేడుకల్లో ప్రముఖులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రముఖ ఆడిటర్ ఖాసింఖాన్ కుమారుడు డాక్టర్ తన్వీర్ అలీఖాన్ నిఖా వేడుకల్లో పలువురు ప్రముఖులు హాజ రయ్యారు. ఆదివారం మాధవి కన్వెషన్‌లో నిఖా వేడుకలు ఏర్పాటు చేశారు. వధు, వరులకు మాజీ మంత్రి అహ మ్మదుల్లా, ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, వైసిపి రాష్ట్ర నాయకులు అఫ్జల్‌ఖాన్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు నజీర్ అహ్మద్, మానస చిన్నపరెడ్డి, ఆడిటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.షరీఫ్ ఖాన్, అల్ హబీబా విద్యాసంస్థల కరస్పాండెంట్ లయన్ పఠాన్ అక్బర్‌ఖాన్, ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎఎస్.ఫరూక్, మన్సూర్ అలీఖాన్, తౌహిద్, టిడిపి నాయకులు రెడ్యెం వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.


ఖాసింఖాన్ కుమారుడి నిఖా వేడుకల్లో ప్రముఖులు

ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం

కడప అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వి. సుందరరామరాజు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు, సంస్థలకు వత్తాసు పలుకుతూ పేద ప్రజల అభి వృద్ధికి ఆటంకంగా మారిందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో సామాన్యుడు గ్యాస్ కొనలేని దుస్థితిలో ఉన్నాడని చెప్పారు. విద్యుత్ సంస్కరణల పేరుతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

మొదటి ఇన్నింగ్స్‌లో 383 పరుగులు చేసిన కడప జట్టు

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఎస్ అండర్-19 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వైయస్ రాజారెడ్డి ఏసీ ఏ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో కడప జట్టు తన మొదటి ఇన్నింగ్స్ లో 91.ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 383 పరుగులు చేసింది. ఆ జట్టులోని రోహిత్ వర్మ 64, ప్రణవ్ రెడ్డి 78, ప్రనీల్ రెడ్డి 74 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని డి బాలాజీ 3, బ్రహ్మ సాయి తేజ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు.

తాగునీటి ఇబ్బందులను తొలగిస్తాం

- సర్పంచు రాచినేని శ్రీనివాసులు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులను తొలగిస్తామని సర్పంచు రాచినేని శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక పంచాయతీ పరిధిలోని వైఎస్ రాజారెడ్డినగర్‌లోని ప్రజలకు నీటి ఇబ్బందులు తొలగించేందుకు కొత్త పైపులైను పనులు చేపట్టారు. తాగునీటి పైపులైను వేయాలని ఇటీవల వైఎస్ రాజారెడ్డినగర్ ప్రజలు కోరడంతో కొత్త పైపులైన్ పనులు చేపట్టినట్లు చెప్పారు. ప్రతి వీధికి తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. తాగునీటికే ఎక్కువగా ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. సిఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి సహకారంతో వేంపల్లె గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అయా ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు ఉంటే వార్డు సభ్యులతోపాటు ప్రజలు తన దృష్టికి కూడా తేవాలని ఆయన కోరారు.



వైఎస్ రాజారెడ్డినగర్‌లో వేస్తున్న కొత్త తాగునీటి పైప్‌లైన్



మోట్నూతలపల్లెలో తిరుగుతున్న పోలీసులు

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల డిఎస్‌పి వినోద్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం ఉదయం మండల పరిధిలోని సమసాత్మక గ్రామమైన మోట్నూతలపల్లెలో నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉక్కుపాదం మోపుతామన్నారు. గ్రామంలోని అనుమానితుల ఇళ్లను సోదా చేశారు. అలాగే సిబ్బందితో గ్రామ వీధుల్లో తిరుగుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న అనుమానితులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ, పోలీసులు పాల్గొన్నారు.

ఖాజీపేట : ప్రజలు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని, శాంతియుతంగా జీవించి మంచి పేరు తెచ్చుకోవాలని ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని నాగసానిపల్లె గ్రామంలో నాగబంది నిర్వహించారు. ఎర్రచందనం స్మగ్లింగ్, గ్రామంలోని పాత నేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు.



నాగసానిపల్లెలో నిర్వహిస్తున్న నాకాబంది

పెద్దముడియం : మండలంలోని పలు ఫ్యాక్షన్ గ్రామాల్లో ప్రజలు గొడవలు, తగాదాలు, నేరాలకు పాల్పడరాదని జమ్మలమడుగు రూరల్ సిఐ వెంకటకొండారెడ్డి సూచించారు. చిన్నపసుపుల గ్రామంలో ఆదివారం ఆయన సిబ్బందితో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక పనులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత జీవనం కొనసాగించాలని కోరారు.

అందుబాటులో ఎరువులు

చక్రాయపేట : మండల కేంద్రమైన చక్రాయపేటలోని రైతు భరోసా కేంద్రంలో యూరియా, డిఎపి ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆదివారం హార్టికల్చర్ అధికారి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రం వద్దకు వచ్చి తీసుకోవాలని ఆయన సూచించారు.

ప్రతిభకు నిదర్శనం పుట్టా ఓబులేసు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రతిభకు నిదర్శనం ఉపాధ్యాయుడు పుట్టా ఓబులేసు అని ఎంఇఎఫ్. జిల్లా అధ్యక్షుడు పిచ్చికే బాబు అన్నారు. ఆదివారం స్థానిక వివేకానంద జూనియర్ కళాశాలలో పుట్టా ఓబులేసును ఎంఇఎఫ్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా పిచ్చికే బాబు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఉపాధ్యాయ పదోన్నతుల్లో ఓబులేస్ ఒకవైపు ఉపాధ్యాయ వృత్తిలో తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, మరోవైపు పిహెచ్‌డి చేస్తూ, రచయితగా నిరుద్యోగ యువతకు విజయక్రాంతి, విజ్ఞానశాస్త్ర ప్రియులకు సైన్స్ అండ్ టెక్నాలజీ పుస్తకాలను రచించడం ఆయన ప్రతిభకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎంఇఎఫ్ నాయకులు కె.బాల ఓబయ్య, కె.కొండయ్య, నవీన్‌కుమార్, పి.కిరణ్‌కుమార్, పి.చంద్రశేఖర్, కె.బాల గంగయ్య, పి.భాస్కర్, కె.నాగేష్ పాల్గొన్నారు.



ఓబులేసును అభినందిస్తున్న ఎంఇఎఫ్ నాయకులు

క్రైం కార్నర్

నీటిలో మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండలంలోని రాయలపురం బ్రిడ్జి దగ్గర ఉన్న వంక వద్ద ఉన్న నీటిలో స్నానం చేసేందుకు వెళ్లి ఆదివారం ఒంగోలుకు చెందిన బేల్దారి కార్మికుడు చిన్న తోటి పోతురాజు (38) మృతి చెందాడు. కొంతకాలం నుంచి పులివెందుల మోడల్ టౌన్‌లో పోతురాజు కూలి పనులు చేసుకుంటున్నాడు. ఆదివారం అతను వంకలో సరదాగా ఈత కొడుతూ ఒక్కసారిగా నీళ్లలో మునిగిపోవడంతో అక్కడే ఉన్న పలువురు కూలీలు వెంటనే పోలీస్, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు సంఘటనాస్థలం చేరుకుని మునిగిపోయిన పోతురాజును బయటకు తీశారు. అప్పటికే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోతురాజు ప్రకాశం జిల్లా ఉలవలపాడు గ్రామానికి చెందిన వ్యక్తి. అతనికి ముగ్గురు పిల్లలున్నారని తెలుస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన పోతురాజు

40 మద్యం బాటిళ్లు స్వాధీనం : ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని సిద్ధారెడ్డిగారి పల్లె చెక్ పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. ఆ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సీజనల్ దోపిడీ

జ్వరాలకు వేలల్లో వసూలు - అనవసరంగా టెస్టులంటూ రోగుల ఆవేదన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు రోగుల తాకిడీ పెరిగింది. ఇదే అదునుగా ప్రయివేటు ఆస్పత్రులు రోగుల జేబులు ఖాళీ చేస్తున్నాయి. టెస్టుల పేరుతో డబ్బులు గుంజుతున్నారు. అవసరం లేకపోయినా అడ్మిట్ చేసుకుంటూ వేల రూపాయాల ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. జ్వరంతో ప్రయివేటు ఆస్పత్రికి వస్తే వెంటనే రక్త పరీక్ష పేరిట రూ.300 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. జ్వరం తగ్గితే సరి.. లేదంటే పలురకాల టెస్టులు, స్కానింగ్ చేయిస్తున్నారు. రోగి పరిస్థితి తీవ్రంగా లేకపోయినా, మందులు వాడితే తగ్గిపోయే పరిస్థితి ఉన్నా, కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు అనవరసరంగా అడ్మిట్ చేసుకుంటున్నాయి. మూడు నాలుగు రోజులు ఆస్పత్రిలో ఉంచుకుని రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు బిల్లు వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 70 ఆసుపత్రులకు అనుబంధంగా ల్యాబ్‌లున్నాయి. మరో 35 ల్యాబ్‌లు ప్రత్యేకంగా ఏర్పాటయ్యాయి. ఇవికాక జిల్లాలో వందల సంఖ్యలో చిన్నపాటి ల్యాబ్‌లు, అనుమతులు లేకుండానే సుమారు 100 వరకు నడుస్తున్నాయి. నిబంధనల ప్రకారం వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తప్పనిసరిగా జిల్లాలో పర్యటించి ఆయా కేంద్రాలను తనిఖీ చేయాల్సి ఉంది. అయితే వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. చాలామందికి అర్హత లేకపోయినా ల్యాబ్ టెక్నీషియన్లుగా చేర్చుకుంటున్నారు. ఫలితంగా వారిచ్చే రిపోర్టులు సరిగా ఉన్నాయా.. లేదా.. అని కూడా తెలియని పరిస్థితి. కార్పొరేట్ ల్యాబ్‌లతోపాటు చాలావాటికి అనుమతులు లేవు. ప్రయివేట్ ల్యాబ్ నిర్వాహకులు ఏజెంట్లను పెట్టుకుని పెద్దాస్పత్రికి వచ్చే రోగులను అక్కడికి తీసుకెళుతున్నారు. పెద్దాస్పత్రిలో కొన్ని పరీక్షలు బయటకు రాసిస్తుండడంతో ఇదే అవకాశంగా రోగులను తీసుకెళ్లి పరీక్షల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటున్నారు. ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించడం లేదు. ప్రయివేట్ ఆస్పత్రుల్లో వసూలు చేసే ఫీజులు, ఛార్జీల వివరాలను ప్రదర్శించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. అర్హతలేని సిబ్బందిని వైద్యసేవలకు ఉపయోగిస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన వైద్యారోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఆస్పత్రిలో ఎంత ఫీజు వేసినా నోరుమూసుకుని కట్టాల్సి వస్తోందని, దీంతో జేబులు ఖాళీ అవుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతినెలా కమీషన్లు..

కొన్ని డయాగ్నోస్టిక్ కేంద్రాల ప్రతినిధులు వైద్యులకు నెలనెలా కమీషన్లు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు వైద్యులే ల్యాబ్ పెట్టుకొని వైద్య పరీక్షల పేరుతో దోచుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. వైద్య పరీక్షలు చేయాలంటూ వైద్యుడు ప్రయివేట్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తే అందులో 30 నుంచి 40 శాతం వరకు కమీషన్లు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి.

సెలవుల్లో ఉన్నా జీతం

సెలవులు మంజూరు చేయని అధికారులు - జీతం బిల్లులు పెట్టిన డిడిఒ

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వ సేవలు, పథకాలను గ్రామీణ ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయం వ్యవస్థను తెచ్చారు. ఆ దిశగా అడుగులు వేస్తూ శాఖల వారీగా సచివాలయాల్లో ఉద్యోగులను ప్రభుత్వం నియమించింది. అయితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా సచివాలయం ఉద్యోగుల వైఖరి తయారైంది. విధులకు గైర్హాజరవుతూ జీతాలు తీసుకుంటున్న వైనం.

వివరాల్లోకి వెళితే..

మండలంలోని ఓ గ్రామ పంచాయతీకి సంబంధించి ఒక సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-5 కార్యదర్శి సెలవులు మంజూరు చేయాలని లాంగ్ లీవ్ కోసం ఎంపిడిఒకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆ కార్యదర్శికి ఎంపిడిఒ సెలవులు మంజూరు చేసినట్లు ఉత్తర్వులు జారీ చేయలేదు. ఈ నేపథ్యంలో లాంగ్ లీవ్ కోసం దరఖాస్తు చేసుకుని, విధులకు హాజరు కాని కార్యదర్శికి ఇన్‌ఛార్జి డిడిఒ జీతానికి బిల్లు పెట్టడంతో కార్యదర్శి ఖాతాలో ప్రభుత్వం జీతం జమ చేసింది. కార్యదర్శి మొదటగా భార్య కాన్పు విషయంగా సెలవుల కోసం మే 26 నుండి జూన్ 9వరకు సెలవులు మంజూరు చేయాలని మే 5న ఎంపిడిఒకు దరఖాస్తు చేసుకున్నారు. భార్య, బిడ్డల యోగ క్షేమాలు చూసేందుకు ప్రభుత్వం ఆ సెలవులు మంజూరు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు ఎంపిడిఒ కార్యదర్శికి 15 రోజులు సెలవులు మంజూరు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చింతకుంట గ్రామ పంచాయతీ సచివాలయం కార్యదర్శికి సచివాలయం అదనపు బాధ్యతలు అప్పగించారు. సెక్రటరీ రెండవసారి ఆరోగ్యం బాగలేదని వైద్య సేవల నిమిత్తం జూన్ 13 నుండి సెప్టెంబర్ 12 వరకు మళ్లీ మూడు నెలలు లాంగ్ లీవ్ మంజూరు చేయాలని జూన్ 12న ఎంపిడిఒకు దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు దరఖాస్తు తీసుకున్నారు. కానీ ఆ కార్యదర్శికి సెలవులు మంజూరు చేసినట్లు ఎంపిడిఒ ఉత్తర్వులు జారీ చేయలేదు. మళ్లీ చింతకుంట గ్రామ పంచాయతీ సచివాలయం కార్యదర్శికి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఎంపిడిఒ ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయం ఉద్యోగులకు జీతాలు పెట్టే అధికారం ప్రభుత్వం డిడిఒలకు అప్పగించింది. అయితే ఆ గ్రామ పంచాయతీకి సంబంధించిన ఇన్‌ఛార్జి డిడిఒ సదరు కార్యదర్శికి జూన్ నెలకు సంబంధించి జీతానికి బిల్లులు పెట్టారు. ఎంపిడిఒ సెలవు మంజూరు చేశారనుకున్నా, లాంగ్ లీవులో ఉన్న కార్యదర్శికి డిడిఒ జీతం పెట్టకూడదు. దీంతో ప్రభుత్వం జులైలో కార్యదర్శి ఖాతాలో జీతం వేసింది. సెలవుల్లో ఉన్న వారికి డిడిఒ జీతాలు పెట్టడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సచివాలయం ఉద్యోగులు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. కార్యదర్శికి ఎంపిడిఒ సెలవులు మంజూరు చేయకున్నా, కార్యదర్శి విధులకు హాజరు కాకున్నా డిడిఒ జీతం ఎలా పెట్టారని ఇతర సహచర సచివాలయం ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

సెలవులు మంజూరు ఉత్తర్వులు జారీ చేయలేదు

కార్యదర్శి లాంగ్ లీవ్ సెలవులు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. సెలవులు మంజూరు చేసినట్లు ఉత్తర్వులు జారీ చేయలేదు. సెలవుల్లో ఉన్నప్పుడు ఆ ఉద్యోగికి జీతాలు పెట్టకూడదు. జీతాలు పెట్టే అధికారం డిడిఒకే ఉంది. ఉద్యోగులకు లీవ్ మంజూరై సెలవులు ముగించుకుని విధుల్లో చేరాక సంబంధిత పత్రాలు సమర్పించిన తర్వాత జీతాలు పెట్టాలి. విధులకు హాజరు కాని కార్యదర్శికి డిడిఒజీతం పెట్టకూడదు. దీనిపై విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- సూర్యనారాయణరెడ్డి, ఎంపిడిఒ, ముద్దనూరు

కనీస సౌకర్యాలకు నోచని వారపు సంత

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రమైన సింహాద్రిపురంలో నిర్వహించే వారసంత కనీస సౌకర్యాలకు నోచుకోలేదు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఆదివారం నిర్వహించే వారపు సంత ప్రదేశంలో టాయిలెట్లు, ఇతర సదుపాయాలు లేకపోవడంతో సంతకు వచ్చిన ప్రజలు, వ్యాపారస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సంతకు మండల ప్రజలతోపాటు అనంతపురం జిల్లా ఎల్లనూరు మండల ప్రజలు వస్తుంటారు. అయితే సంత నిర్వహించే ప్రాంతంలో ఎలాంటి సదుపాయాలు లేవు. వర్షాకాలంలో మార్కెట్‌లో ప్రజలు, వ్యాపారస్తులు, రైతులు ఇక్కట్లకు గురవుతున్నారు. ముఖ్యంగా సంతకు మహిళలు అధిక సంఖ్యలో వచ్చి కూరగాయలను కొనుగోలు చేస్తుంటారు. అయితే కనీస సౌకర్యాలు లేకపోవడం పట్ల వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీనిపై పంచాయతీ అధికారి హరికిషోర్‌ను అడగ్గా త్వరలోనే పాత తహశీల్దార్ కార్యాలయం సమీపంలో అన్ని వసతులతో సంత నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీంతోపాటు ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే మార్కెట్ యార్డులో నిర్వహించేలా చూస్తామన్నారు. అక్కడ అన్ని వసతులు ప్రజలకు వ్యాపారస్తులకు కల్పించేలా చూస్తామన్నారు.



సింహాద్రిపురంలో నిర్వహిస్తున్న వారపు సంత



దర్పణం శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

'అలుగోగు కథలు చిరస్థాయిగా నిలుస్తాయి'

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాయలసీమ కథా సాహిత్యరంగంలో దర్పణం శ్రీనివాస్ రచించిన అలుగోగు కథలు చిరస్థాయిగా నిలుస్తాయని ప్రముఖ కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ వేంపల్లె షరీఫ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీనివాస డిగ్రీ కళాశాలలో గడియారం సాహితీపీఠం అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు అధ్యక్షుతన దర్పణం శ్రీనివాస్ రచించిన అలుగోగు కథలు పుస్తకావిష్కరణ చేశారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ వేంపల్లె షరీఫ్ మాట్లాడుతూ ఈ పుస్తకంలో రచయిత రాయలసీమ జీవితాన్ని సీమ భాషలో అక్షరీకరించారన్నారు. కథల కోసం దర్పణం శ్రీనివాస్ కష్టపడి విషయాలు తెలుసుకొని రాశారని, ఇందుకు ఉదాహరణ దొమ్మరాట కథ పేరును ప్రస్తావిస్తూ ప్రశంసించారు. తొలుత యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎం వినోదిని అలుగోగు కథల పుస్తకాన్ని ఆవిష్కరించి తొలి కాపీని డాక్టర్ వేంపల్లె షరీఫ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వినోదిని మాట్లాడుతూ దర్పణం శ్రీనివాస్ రచన రాయలసీమ అస్తిత్వ వాదానికి దర్పణం పడుతోందన్నారు. గడియారం సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి మిరియాల శివగణపతి పుస్తక సమీక్ష చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాల అవార్డు పొందిన చదువులబాబు మాట్లాడారు. అనంతరం ప్రొద్దుటూరుకు చెందిన కవయిత్రి దుర్గా భవాని, స్థానిక ప్రభుత్వ పెన్షనర్ల సంఘం గౌరవాధ్యక్షుడు పొన్నారి దస్తగిరి, ఎస్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుకుమార్, జమ్మలమడుగు, పెద్దముడియం ఎంఇఒలు పరమేశ్వరయ్య, చౌడయ్య ప్రసంగించారు. చివరగా దర్పణం శ్రీనివాస్‌ను గడియారం సాహితీ పీఠం వారు ఘనంగా సత్కరించారు. కళాకారులు, రచయితలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెతికినా కనిపించని అభివృద్ధి : భూపేష్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : రాష్ట్రంలో కాదుకదా కనీసం నియోజక వర్గంలో కూడా ఎంత వెతికినా అభివృద్ధి కనపడడం లేదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం నియోజకవర్గంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బస్సు యాత్ర ప్రారంభించారు. ఇది ముందుగా మైలవరంలో ప్రారంభంమై జమ్మలమడుగు నుంచి ముద్దనూరుకు వెళుతుంది. ఈ సందర్భంగా స్థానిక గాంధీబొమ్మ వద్ద భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు కట్టించిన టిట్కో ఇళ్లకు వైసిపి రంగులేసి ఇంతవరకు ప్రారంభించలేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కచ్చితంగా టిడిపి అధికారంలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, జమ్మలమడుగు పార్టీ పరిశీలకులు రామకృష్ణ, ముక్తియార్, లక్ష్మిరెడ్డి, వికాస్ హరి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, అన్నెబొయిన కొండయ్య, ఎస్టీ సెల్ నాయకుడు హనుమంతు నాయక్, జింకల బాషా, దువ్వూరు మురళి, పొన్నతోట శ్రీను, మల్లికార్జున, వెల్డింగ్ గైబు, సర్దార్ పాల్గొన్నారు. **ముద్దనూరు :** జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్ర ఆదివారం మధ్యాహ్నం ముద్దనూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండల నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ముద్దనూరు-జమ్మలమడుగు రహదారిలోని శివాలయం వద్ద నుండి టిడిపి దేవగుడి అభిమానులు, కార్యకర్తలు భారీ ఎత్తున బైకుల్లో ఘనంగా స్వాగతం పలికారు. టిడిపి కార్యాలయంలో భోజనం అనంతరం బస్సు యాత్ర పాత బస్టాండు నుండి నాలుగు రోడ్ల మీదుగా ఎర్రగుంట్లకు బయలుదేరింది. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, టౌన్ ఇన్‌ఛార్జి రంగారెడ్డి, మైనారిటీ నాయకులు అబ్దుల్ ఖాదర్, నాయకులు భాస్కర్‌రెడ్డి, సత్తార్, బాబా అమీర్, సన్నీ పాల్గొన్నారు.

'వైఎస్ఆర్ పెళ్లి కానుక'లో వివక్ష సరికాదు

వేంపల్లె : వైఎస్ఆర్ పెళ్లి కానుక పథకంలో కులాలు, మతాలు మధ్య జగన్ ప్రభుత్వం వివక్ష చూపడం శోచనీయమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా మూడేళ్లు వైఎస్ఆర్ పెళ్లి కానుక పథకాన్ని అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్నప్పటికీ వివక్ష చూపుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, ముస్లిం, క్రిష్టియన్ మైనార్టీ చెల్లెమ్మల వివాహానికి వైఎస్ఆర్ పెళ్లి కానుక పేరుతో లక్ష రూపాయల ఆర్థికసాయం చేస్తుండగా, బిసి చెల్లెమ్మల వివాహానికి రూ.50 వేలు మాత్రమే ఇవ్వడం అన్యాయమన్నారు. అగ్రవర్ణాల్లో అనేక మంది కటిక దరిద్రాన జీవిస్తున్నట్లు చెప్పారు.

అందరి సహకారంతోనే డిగ్రీ కళాశాల అభివృద్ధి

వేంపల్లె : ప్రభుత్వ వైఎస్ఆర్ వివేకానంద డిగ్రీ కళాశాల అభివృద్ధికి అందరి సహకారం అవసరమని జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ వైఎస్ఆర్ వివేకానంద డిగ్రీ కళాశాల ఆవరణలో కళాశాల అభివృద్ధిపై ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు ఆధ్వర్యంలో కళాశాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు యూనిఫాం, మెరిట్ విద్యార్థులకు పారితోషికాలు, బహుమతులు ఇవ్వాలని కమిటీ సభ్యులు కోరారు. కళాశాలలో పరిశుభ్రత, వీధి దీపాలకు తక్షణమే చర్యలు తీసుకుంటామని సర్పంచు రాచినేని శ్రీనివాసులు అన్నారు. మైనారిటీ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు అధ్యాపకులు కృషి చేయాలని సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్ వలి కోరారు. సమావేశంలో కళాశాల కమిటీ సభ్యులు రాజు, బాలం గోపాల్, పిఆర్ఒ బాల నారాయణ, అధ్యాపక సంఘం కార్యదర్శి బాలకొండ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరినవారితో పుట్టా సుధాకర్ యాదవ్

వైసిపి నుంచి టిడిపిలోకి చేరిక

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని నాగసానిపల్లిలో వైసిపి నుంచి పెద్ద ఎత్తున టిడిపిలోకి చేరారు. ఆదివారం టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా పుట్టా సుధాకర్ యాదవ్, పార్టీ మండల కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి వారికి పార్టీ కండు వాలు కప్పి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన పెరుగు పెద్ద ఎల్లయ్య, కరమల నాగరాజు, పద్మావతి, వెంకటసుబ్బయ్య, పుల్లూరు వెంకటేసు, పుల్లూరు రమణ, నాగరాజు, పెరుగు వీరయ్య, గంగయ్య, వెంకటేష్, బయన బోయిన వెంకట రమణ, వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చేరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జానకి రామ్ నాయుడు, సందుల నాగశివారెడ్డి, దాసరి శ్రీని వాసులు, ప్రతాప్‌రెడ్డి, నంద్యాల సుబ్బయ్య యాదవ్, రమేష్ నాయుడు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రామ అనిల్‌కుమార్‌రెడ్డి

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మండల పరిధిలోని జివి సత్రం జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఎస్ఎల్ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. శిబిరంలో డాక్టర్ మూలె రామ అనిల్‌కుమార్‌రెడ్డి వంద మందికి షుగర్, బిపి, ఇసిజి, అవసరమైన వారికి లిపిడ్ ప్రొఫైల్, హెచ్‌బి ఎబిసి ఒక్కొక్కరికి రూ.1500 విలువైన పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. షుగర్, బిపి ఉన్నవారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. వ్యాయమం, ఆహర అలవాట్ల గురించి వివరించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

పాత చెరువు నుంచి నీటి విడుదల

ప్రజాశక్తి - లింగాల

మండల కేంద్రమైన లింగాల పాత చెరువు నుంచి వనం బావి దగ్గరికి ఏర్పాటు చేసిన నీటిని ఆదివారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విడుదల చేశారు. లింగాల కుడి కాలువ నుంచి పాత చెరువుకు రెండు నెలల కిందట ఎత్తిపోతల నీటి సంపుని ప్రారంభించారు. అనంతరం పాత చెరువు నుంచి వనం బావి దగ్గర ఉన్న వంకకు ఆదివారం ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైయస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జలయజ్ఞం పథకంలో భాగంగా లింగాల కుడికాలువ ఏర్పాటు చేశారని, తద్వారా లింగాల, పులివెందుల, వేముల మండల రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా కాలువలు, పిల్ల కాలువలు ఏర్పాటు చేసి ఆయా గ్రామాల చెరువులకు నీటిని అందించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా లింగాల పాత చెరువు నుంచి వనం బావి వద్దకు దాదాపు మూడు కిలోమీటర్ల మేర పైపులు వేసి నీటి సరఫరా చేయనున్నట్లు వివరించారు. అనంతరం మండల ప్రజలు పెద్ద ఎత్తున పలు రకాల సమస్యలతో అర్జీలు ఇచ్చారు. వాటిని పరిష్కరించాలని అక్కడికి వచ్చిన అధికారులకు ఎంపీ సూచించారు. వనం బావి వద్ద సరఫరా అవుతున్న నీటిని పరిశీలించారు. కార్యక్రమంలో లింగాల ఎంపిపి అమృత, పులివెందుల ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, కడప పార్లమెంటు సెక్రెటరీ చంద్రశేఖర్‌రెడ్డి, కర్ణ రమేష్‌రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



కర పత్రాలు ఆవిష్కరిస్తున్న ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ

కార్మికుల సమస్యలపై కరపత్రం విడుదల

ప్రజాశక్తి - చాపాడు

విద్యుత్ ఉద్యోగుల కార్మికుల సమస్యల పరిష్కారానికి విజయవాడలో జరుగు సదస్సులు జయప్రదం చేయాలని ఎపి విద్యుత్తు ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారే తప్ప.. ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కరించే వాతావరణం కనబడలేదన్నారు. కార్మిక సంఘాలు చేసే పోరాటానికి వారంతా కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, జెఎసి పి.సుదర్శన్‌రెడ్డి, వెన్నపూస సుబ్బిరెడ్డి, పొన్నా శివయ్య, బ్రహ్మానందరెడ్డి, శివశంకర్, నాయబ్, గురుస్వామి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఈశ్వరయ్య, శ్రీనివాసులు, వి.గంగయ్య, పి.సురేష్ బాబు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - చాపాడు

లక్ష్మీపేట పాఠశాలలో 1991-1992లో 10వ తరగతి చదివిన విద్యార్థుల కలయిక స్థానిక పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు సాంబ శివారెడ్డి మాట్లాడుతూ తమ వద్ద చదువుకున్న విద్యార్థులు వివిధ రంగాల్లో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవడం, ప్రస్తుతం వారిని చూస్తే ఎంతో సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఎన్ఆర్ఐ ద్వార్శల కొండారెడ్డి మాట్లాడుతూ 31 ఏళ్ల తర్వాత స్నేహితులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులు పుల్లారెడ్డి, జాన్ సుబ్బరాయుడు, ఆర్గనైజర్ వెంకట సుబ్బారెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు